



జాతీయ తెలుగు దినపత్రిక

# ప్రజాజ్యోతి

ప్రతి అక్షరం ప్రజల కోసం



నల్లగొండ

సూర్యాపేట - యాదాద్రి భువనగిరి

శనివారం 8-8-2026 www.prajajyothinews.com పేజీలు : 8


## చదివే వీలు లేకపోతే వారి భవిష్యత్తుకు భరోసా ఏది

బధిర,దృష్టిలోపం విద్యార్థులకు ప్రత్యేక డిగ్రీ కళాశాల ఏర్పాటు కోసం ప్రయత్నించాలంటూ ఎమ్మెల్యే కు వినతి

మిర్యాలగూడ, ఆగస్టు 07,(ప్రజాజ్యోతి): తెలంగాణ రాష్ట్రంలో బదిరులు (చెవిటి, మూగ), దృష్టిలోపం ఉన్న విద్యార్థుల ఉన్నత భవిష్యత్తు కోసం డిగ్రీ కళాశాల ఏర్పాటుకు ప్రయత్నించాలంటూ మిర్యాలగూడ ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి ని కోరారు. బీసీ చైతన్య విద్యార్థి విభాగం రాష్ట్ర అధ్యక్షులు నగేష్ సూర్యవంశం. మిర్యాలగూడ పట్టణంలోని స్థానిక ప్రభుత్వ జూనియర్ ...

మిగతా 6లో...

# మా నిధులు మాకివ్వాల్సిందే!

- ఆర్డీఓ కార్యాలయాన్ని ముట్టడించిన బీజేపీ శ్రేణులు
- చౌటుప్పల్‌లో హోరెత్తిన ప్రదర్శన.. వైఖరి మారకపోతే ఉద్యమం ఉధృతం
- కాంగ్రెస్ నాయకులకు కొమ్ముకాస్తున్నారని అధికారులపై గంగిడి మోనోహర్ రెడ్డి,కాసం వెంకటేశ్వర్లు ధ్వజం



చౌటుప్పల్, ఆగస్టు 7 (ప్రజాజ్యోతి): ఉపాధి హామీ నిధుల కేటాయింపులో బీజేపీకి చెందిన సర్పంచులు, కౌన్సిలర్ల పట్ల స్థానిక ఎమ్మెల్యే, అధికారులు తీవ్ర వివక్ష చూపుతున్నారని బీజేపీ రాష్ట్ర నాయకుడు గంగిడి మనోహర్‌రెడ్డి, కాసం వెంకటేశ్వర్లు ధ్వజమెత్తారు. ప్రతిపక్ష ప్రజాప్రతినిధులకు నిధులు దక్కకుండా వేధిస్తున్నారని మండిపడ్డారు. అధికారుల పక్షపాత వైఖరిని నిరసిస్తూ శుక్రవారం చౌటుప్పల్‌లో బీజేపీ శ్రేణులు భారీ ఆందోళన చేపట్టాయి.

మిగతా 6లో...

## దశాబ్ద కాలం పోరాటం... ఎస్సీ కమిషన్ ఆదేశాలతో

- యాదాద్రి పవర్ ప్లాంట్ వద్ద ఉమ్మడి సర్వే

3



# ఈ నెల 10న రేవంత్ రెడ్డి సాగర్ పర్యటన

- నాగార్జునసాగర్ లో సీఎం వరుణ యాగం
- ఏర్పాట్లను పరిశీలించిన జిల్లా కలెక్టర్ బడుగు చంద్రశేఖర్

మిగతా 5లో...



# మహిళల ఆర్థిక సాధికారతే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యం

**గౌరీకుంట తండా, గుడితండాల్లో మహిళా సమాఖ్య భవనాలను ప్రారంభించిన ఎమ్మెల్యే నేనావత్ బాలు నాయక్**

**కొండమల్లేపల్లి, ఆగస్టు 7, (ప్రజాజ్యోతి):** మహిళల ఆర్థిక, సామాజిక అభివృద్ధికి కాంగ్రెస్ ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని, మహిళల సాధికారతే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని దేవరకొండ ఎమ్మెల్యే నేనావత్ బాలు నాయక్ అన్నారు. కొండమల్లేపల్లి మండలంలోని గౌరీకుంట తండాలో రూ. 10 లక్షలతో నిర్మించిన మహిళా సమాఖ్య భవనాన్ని సంబంధిత అధికారులతో కలిసి ఎమ్మెల్యే ప్రారంభించారు. అనంతరం గుడితండాలో రూ. 10 లక్షల వ్యయంతో నిర్మించిన మరో మహిళా సమాఖ్య భవనాన్ని ప్రారంభించి మహిళా సంఘాల సభ్యులకు శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ మహిళా సంఘాలు గ్రామీణాభివృద్ధికి, కుటుంబాల ఆర్థిక పురోగతికి వెన్నెముకలుగా నిలుస్తున్నాయని పేర్కొన్నారు. మహిళా సమాఖ్యలకు శాశ్వత కార్యాలయం ఉండటం వల్ల సంఘ సమావేశాలు, పొదుపు-రుణాల నిర్వహణ, లెక్కల నిర్వహణ, శిక్షణా కార్యక్రమాలు, ప్రభుత్వ సంక్షేమ పథకాలపై అవగాహన సదస్సులు, స్వయం ఉపాధి కార్యక్రమాల ప్రణాళికలు ఒకే చోట నిర్వహించుకునే అవకాశం ఉంటుందని తెలిపారు. ఈ భవనాలు మహిళల ఐక్యతకు, గ్రామాభివృద్ధిలో వారి భాగస్వామ్యానికి కేంద్రాలుగా నిలుస్తాయని అన్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి నాయకత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వం మహిళా సంక్షేమానికి ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తోందని ఎమ్మెల్యే పేర్కొన్నారు. మహాలక్ష్మి పథకం ద్వారా మహిళలకు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణ సౌకర్యం కల్పించడం, స్వయం సహాయక సంఘాల బలోపేతానికి చర్యలు చేపట్టడం, స్వయం ఉపాధి అవకాశాలను విస్తరించడం, బ్యాంకు రుణాల అనుసంధానం, వడ్డీ భారం తగ్గించే చర్యలు, నైపుణ్యాభివృద్ధి శిక్షణ కార్యక్రమాలను ప్రభుత్వం అమలు చేస్తోందని




వివరించారు. మహిళా సంఘాల కార్యకలాపాలు మరింత విస్తరించేందుకు ప్రభుత్వం ద్వారా మహిళా సంఘాలకు బస్సు మంజూరయ్యేలా తన వంతు కృషి చేస్తానని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. ఆ బస్సును మహిళలు ఉపాధి, శిక్షణ, మార్కెటింగ్, ఇతర సామూహిక కార్యక్రమాలకు వినియోగించుకుని మరింత అభివృద్ధి సాధించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో దేవరకొండ మార్కెట్ కమిటీ చైర్మన్ నాయిని జమున మాధవరెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ వేణుధర్ రెడ్డి, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు కాసర్ల వెంకటేశ్వర్లు, జిల్లా ప్రధాన కార్యదర్శి ఊట్కూరి వేమన్ రెడ్డి, కొండమల్లేపల్లి సర్పంచ్ పసునూరి యుగంధర్ రెడ్డి, సర్పంచుల ఫోరం అధ్యక్షులు రామావత్ సరస్వతి--రవి, స్థానిక సర్పంచ్ నేనావత్ కృష్ణ, మాజీ ఎంపీపీ మేకల శ్రీనివాస్ యాదవ్, ఉప సర్పంచులు వాంకుడావత్ డాకు, రామావత్ చంటి, మండల మహిళా సమాఖ్య అధ్యక్షురాలు భూతరాజు ప్రేమలత, ఏపీఎం యాదయ్య, వివోఏ రమావత్ స్వామి, ప్రజాప్రతినిధులు, మహిళా సంఘాల సభ్యులు, బంజారా సంఘాల ప్రతినిధులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# రూ.15 కోట్లతో ఇంటిగ్రేటెడ్ మండల కార్యాలయాల సముదాయం

**- ప్రజా సమస్యల పరిష్కారంలో జాప్యాన్ని సహించం: ఎమ్మెల్యే బాలు నాయక్**




**కొండమల్లేపల్లి, ఆగస్టు 7, (ప్రజాజ్యోతి):** ప్రజలకు ప్రభుత్వ సేవలు వేగంగా, పారదర్శకంగా అందించేందుకు అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని దేవరకొండ ఎమ్మెల్యే నేనావత్ బాలు నాయక్ అధికారులను ఆదేశించారు. ప్రజా సమస్యల పరిష్కారంలో నిర్లక్ష్యం, జాప్యాన్ని ఏమాత్రం సహించబోమని స్పష్టం చేశారు. తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా నిర్వహిస్తున్న వన మహోత్సవం కార్యక్రమంలో భాగంగా శుక్రవారం కొండమల్లేపల్లి మండల కేంద్రంలో వివిధ శాఖల అధికారులతో కలిసి ఎమ్మెల్యే మొక్కలు నాటి పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ బాధ్యతగా ముందుకు రావాలని పిలుపునిచ్చారు. మొక్కలను నాటడమే కాకుండా వాటిని సంరక్షించి భావితరాలకు పచ్చని తెలంగాణను అందించాలని సూచించారు. అనంతరం మండల కార్యాలయంలో నిర్వహించిన మండల జనరల్ బాడీ సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరైన ఎమ్మెల్యే, మండలంలోని అన్ని ప్రభుత్వ శాఖల పనితీరును సమీక్షించారు. ప్రజలకు ప్రభుత్వ సేవలు ఆలస్యం కాకుండా ప్రతి అధికారి బాధ్యతాయుతంగా పనిచేయాలని ఆదేశించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, రూ. 15 కోట్ల వ్యయంతో కొండమల్లేపల్లి మండల కేంద్రంలో ఆధునిక సౌకర్యాలతో ఇంటిగ్రేటెడ్ మండల కార్యాలయాల సముదాయ భవనాన్ని త్వరలో నిర్మించనున్నట్లు ప్రకటించారు. ఈ భవనం ఏర్పాటుతో ప్రజలకు వివిధ ప్రభుత్వ శాఖల సేవలు ఒకేచోట అందుబాటులోకి వస్తాయని తెలిపారు. సమావేశంలో తహసీల్దార్, ఎంపీడీఓ, మండల విద్యాధికారి, వ్యవసాయ, ఉద్యానవన, పశుసంవర్ధక, గ్రామీణ నీటి సరఫరా, పంచాయతీరాజ్, విద్యుత్, రోడ్లు-భవనాలు, నీటిపారుదల, వైద్య ఆరోగ్య, ఐసీడీఎస్, ఉపాధి హామీ, పౌర సరఫరాలు, అటవీ, హౌసింగ్ తదితర శాఖల అధికారులు తమ శాఖల పనితీరు, అభివృద్ధి కార్యక్రమాలు, పెండింగ్ పనులపై నివేదికలు సమర్పించారు. మండలంలోని సర్పంచులు గ్రామాల్లో తాగునీటి సమస్యలు, సీసీ రోడ్లు, డ్రైనేజీలు, విద్యుత్ అంతరాయాలు, సాగునీటి ఇబ్బందులు, పాఠశాలల్లో మౌలిక వసతుల కొరత, అంగన్‌వాడీ భవనాల అవసరం, వైద్య సేవలు, రేషన్ పంపిణీ, ఉపాధి హామీ పనులు, పెండింగ్ అభివృద్ధి పనులను ఎమ్మెల్యే దృష్టికి తీసుకువచ్చారు. దీనిపై స్పందించిన ఎమ్మెల్యే, ప్రజలు సమస్యల పరిష్కారం కోసం కార్యాలయాల చుట్టూ తిరిగే పరిస్థితి ఉండకూడదని అన్నారు. తాగునీటి సమస్యలను అత్యవసరంగా పరిష్కరించాలని గ్రామీణ నీటి సరఫరా అధికారులను, విద్యుత్ సమస్యలను వెంటనే పరిష్కరించాలని విద్యుత్ శాఖ అధికారులను, రైతులకు ఎరువులు, విత్తనాల కొరత లేకుండా చూడాలని వ్యవసాయ శాఖ అధికారులను, ప్రభుత్వ పాఠశాలల్లో విద్యా ప్రమాణాలు మెరుగుపర్చాలని విద్యాశాఖ అధికారులను, ప్రభుత్వ ఆసుపత్రుల్లో నాణ్యమైన వైద్య సేవలు అందించాలని వైద్య ఆరోగ్య శాఖ అధికారులను ఆదేశించారు. అలాగే గ్రామాల్లో పెండింగ్‌లో ఉన్న సీసీ రోడ్లు, డ్రైనేజీలు, అంతర్గత రహదారులు, కమ్యూనిటీ భవనాల నిర్మాణాన్ని వేగవంతం చేయాలని సంబంధిత శాఖలకు సూచించారు. మహిళా సంఘాల బలోపేతం, స్వయం ఉపాధి అవకాశాల కల్పన, ఉపాధి హామీ పనుల సమర్థవంతమైన అమలుకు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని కోరారు. రాష్ట్ర ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి నాయకత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వం గ్రామీణాభివృద్ధి, ప్రజా సంక్షేమానికి అత్యధిక ప్రాధాన్యత ఇస్తోందని ఎమ్మెల్యే పేర్కొన్నారు. ప్రభుత్వం కేటాయిస్తున్న నిధులను సద్వినియోగం చేసుకొని ప్రతి గ్రామాన్ని ఆదర్శ గ్రామంగా తీర్చిదిద్దేందుకు అధికారులు, ప్రజాప్రతినిధులు సమిష్టిగా కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో పీఏసీఎస్ చైర్మన్ దూదిపాల వేణుధర్ రెడ్డి, మండల వివిధ శాఖల అధికారులు, సర్పంచులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

# కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల ప్రజావ్యతిరేక విధానాలపై పోరాడుదాం

**-- దోపిడి రైత సమాజం కోసం,కష్టజీవుల హక్కులకోసం పోరాడిన ప్రజానాయకుడు రాసాల వెంకటేశం**

**-- సీపీఎం తెలంగాణ రాష్ట్ర కార్యదర్శి జాన్ వెస్లీ పిలుపు**



**భువనగిరి,ఆగస్ట్ 7(ప్రజాజ్యోతి):** కేంద్రంలోని మోడీ ప్రభుత్వం, రాష్ట్రంలోని రేవంత్ రెడ్డి ప్రభుత్వాలు అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా ప్రజలు పోరాటాలకు సిద్ధం కావాలని సీపీఎం,రాష్ట్ర కార్యదర్శి జాన్ వెస్లీ పిలుపునిచ్చారు. సమావేశంలో కొనసాగుతున్న దోపిడి పోవాలని,ఎర్రజెండా రాజ్యం రావాలని,ప్రజల హక్కుల కోసం జీవితాంతం పోరాడిన ,అమరజీవి కామ్రేడ్ రాసాల వెంకటేష్ ఆశయ సాధనలో కామ్రేడ్స్ అందరూ కృషి చేయాలని కోరారు. భువనగిరి మండల పరిధిలోని బస్వాపురం గ్రామంలో సీపీఎం సీనియర్ నాయకులు,మాజీ సర్పంచ్ కామ్రేడ్ రాసాల వెంకటేశం ప్రథమ వర్ధంతి సందర్భంగా గ్రామంలో నిర్మించిన స్మారక స్తూపాన్ని సీపీఎం కేంద్రకమిటీ సభ్యులు ఎస్.వీరయ్య,జిల్లా కార్యదర్శి యండి. జహంగీర్ కుటుంబ సభ్యులకు కలిసి జాన్ వెస్లీ ఆవిష్కరించిన అనంతరం జరిగిన భారీ బహిరంగ సభలో పాల్గొని మాట్లాడుతూ కేంద్రంలో బీజేపీ ఆధ్వర్యంలో నాయకత్వం వహించిన పరిపాలన కొనసాగిస్తున్న నరేంద్రమోదీ ఒక నియంతలాగా,నేనే రాజు నేనే మంత్రి,అన్నట్లుగా ఉన్నారని విమర్శించారు. నీట్ పరీక్షల్లో జరిగిన తప్పులపైన చర్యలు తీసుకోవాలని పోరాటం చేస్తున్న విద్యార్థులు, యువకులపైన నిర్బంధం కొనసాగిస్తూ పైశాచిక ఆనందం పొందుతూ అనిచివేతకు గురి చేస్తూ విద్యార్థులను తీవ్రమైన ఇబ్బందుల గురి చేస్తున్నారని విమర్శించారు. బీజెపి అనుసరిస్తున్న కార్పొరేట్ శక్తుల అకూల విధానాలకు వ్యతిరేకం లేబర్ కోడ్లను వీబీజీ,గ్రామ్ జి చట్టాన్ని రద్దుచేయాలని,విద్యుత్ విత్తన, జాతీయ ఆహార భద్రత చట్టాల సవరణలను విరమించుకోవాలని డిమాండ్ల సాధన కోసం ప్రజలు తిరగబడాలని పిలుపునిచ్చా. రాష్ట్రంలో ఆరు గ్యారంటీల పేరుతో అధికారంలో వచ్చిన రేవంత్ రెడ్డి ప్రభుత్వం రోజు రోజుకు,విద్య,వైద్యం వ్యాపారంగా మారుస్తూ పేదలను విద్య వైద్యానికి దూరం చేస్తున్నారు విమర్శించారు. ఎందుకు ఉచిత విద్య,వైద్యం ఇవ్వడం లేదో సమాధానం చెప్పాల్సిన డిమాండ్ చేశారు. ఇంకా పేదలు ఇండ్లు, ఇళ్ల స్థలాలు లేక ఇబ్బందులు పడుతున్నారు ఇల్లు లేని పేదలందరికీ ఇళ్ల స్థలాలు ఇచ్చి ఇంటి నిర్మాణం చేసి ఇవ్వాలని కోరారు. ఈ కార్యక్రమం లో రాష్ట్ర కమిటీ సభ్యులు కొండ మడుగు నర్సింహ,వెంకటేష్ శ్రీకాంత్ పాల్గొని గ్రామ శాఖ కార్యదర్శి మచ్చ భాస్కర్,సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు మాటూరి బాలరాజు,కల్లూరి మల్లేశం,దాసరి పాండు బూరుగు కృష్ణారెడ్డి, జిల్లా కమిటీ సభ్యులు దయ్యాల నర్సింహ,మండల కార్యదర్శి పల్లెర్ల అంజయ్య,కుటుంబ సభ్యులు గ్రామ మాజీ సర్పంచ్ రాసాల నిర్మల శ్రీశైలం,తదితరులు పాల్గొన్నారు.



## మిత్రుని కుటుంబానికి ఆర్థిక సాయం అందజేత



**నాంపల్లి, ఆగస్టు, 07(ప్రజా జ్యోతి ):**
మండల పరిధిలోని మహ్మదాపురం గ్రామానికి చెందిన తెలగమల్ల మురళి గత కొద్ది రోజుల క్రితం చికిత్స పొందుతూ మృతి చెందాడు. విషయంతెలుసుకున్న గుర్రంపోడు మండలంలోని పిట్టలగూడెం జిల్లా ఉన్నత పాఠశాలలో అతనితో పాటు చదువుకున్న తోటి విద్యార్థులు అతని కుటుంబ సభ్యులను పరామర్శించి, మనోధైర్యం కల్పించారు. అనంతరం రూ. 15వేలు ఆర్థిక సహాయాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎండి అస్లం, మారెపాక అంబేద్కర్, నక్క శ్రీనివాసులు, జెల్లా బిక్షం, దాసరి రమేష్, ఎస్కే అక్బర్, బొడ్డు వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

## ప్రజారోగ్యం.. వార్డు అభివృద్దే ధ్యేయం

**- తీజ్ వేడుకలకు ప్రత్యేక పారిశుద్ధ్య పనులు**

**- కౌన్సిలర్ గౌహర్ జబీన్ మజహర్**



**హాలియా,ఆగస్టు7(ప్రజా జ్యోతి):**
ప్రజల ఆరోగ్యం వార్డు అభివృదే తమ ప్రథమ ధ్యేయమని హాలియా మున్సిపాలిటీ ఎనిమిదవ వార్డు కౌన్సిలర్ గౌహర్ జబీన్ మజహర్ అన్నారు. శుక్రవారం జనావాసాల మధ్య అసాంఘిక కార్యకలాపాలకు నిలయంగా మారి,ప్రజలను భయాందోళనకు గురి చేస్తున్న పొదలు కంప చెట్లను జెసిబి సహాయంతో తొలగించి పారిశుధ్య కార్యక్రమానికి ఆమె శ్రీకారం చుట్టారు. అలాగే గత వారం రోజులుగా సాయిబాబా ఆలయ ప్రాంగణంలో వైభవంగా నిర్వహించిన గిరిజన సంప్రదాయ తీజ్ వేడుకల వేదిక పారిశుధ్య పనులు పర్యవేక్షణ పరిసరాలను పరిశుభ్రం చేయించి బ్లీచింగ్ చేయించారు. కార్యక్రమంలో టౌన్ వర్కింగ్ ప్రెసిడెంట్ నెర్మటి వెంకట్ రెడ్డి, మరగోని చంద్రశేఖర్, మహిళా కాంగ్రెస్ సభ్యురాలు నాగేంద్రమ్మ, వార్డు ప్రజలు, మున్సిపల్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## సర్దార్ పాపన్న జయంతి పోస్టర్ ఆవిష్కరణ



**నడిగూడెం, ఆగస్టు 6: ప్రజా జ్యోతి:**
జై గౌడ జాతీయ ఉద్యమ సంఘం ఆధ్వర్యంలో నిర్వహించనున్న సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ 376వ జయంతి జాతీయ వారోత్సవాల పోస్టర్‌ను నడిగూడెం మండలం సిరిపురం గ్రామంలో ఘనంగా ఆవిష్కరించారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షుడు కేశగాని నాగేశ్వరరావు గౌడ్ మాట్లాడుతూ, ఆగస్టు 10న హైదరాబాద్ రవీంద్రభారతిలో జరిగే రాష్ట్రస్థాయి జయంతి మహోత్సవాలకు గౌడ సంఘాల నాయకులు, యువత, మహిళలు, ప్రజాప్రతినిధులు అధిక సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో మొక్క గురుమూర్తి గౌడ్, గుండు చిరంజీవి గౌడ్, ఎలుగూరి వెంకటేశ్వర్లు గౌడ్, మొక్క నారాయణ గౌడ్, మామిడి రంగయ్య గౌడ్, పోలపల్లి వీరయ్య గౌడ్, మొక్క మాధవ గౌడ్, మామిడి వెంకటయ్య గౌడ్, వట్టికూటి వెంకన్న గౌడ్, కేసగాని మట్టయ్య గౌడ్, వట్టికూటి రామయ్య గౌడ్, వట్టికూటి వెంకటేశ్వర్లు గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

# ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో ఆరోగ్యశ్రీ వారోత్సవాలు



**నాగారం ఆగస్టు 07 ప్రజా జ్యోతి:**
నాగారం మండల పరిధిలోని నాగారం బంగ్లా లో ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో ఆరోగ్య శ్రీ వారోత్సవాలను ఘనంగా నిర్వహించారు. శుక్రవారం ఎమ్మార్పీఎస్, ఎంఎస్పి ఆధ్వర్యంలో జరిగిన ఆరోగ్యశ్రీ సాధన దినోత్సవ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా నాగారం మండల ఇన్చార్జి ఏపూరి రాజు మాదిగ విచ్చేసి మాట్లాడుతూ ఖమ్మం జిల్లాకు చెందిన ఒక ముస్లిం మహిళ కుమార్తెకు గుండె ఆపరేషన్ నిమిత్తం లక్షల రూపాయలు వైద్యానికి అవుతుందని మందకృష్ణ మాదిగ ను ఆశ్రయించగా ఈ పాపతో పాటు 2004 లో గుండె జబ్బులతో బాధపడుతున్న వేలాదిమంది పిల్లలతో హైదరాబాదులో చేపట్టిన ఉద్యమ పోరాట ఫలితంగానే ఆరోగ్యశ్రీ పథకం ఏర్పడిందని అన్నారు. ఈ పథకం ద్వారా పేద ప్రజలకు నాణ్యమైన కార్పోరేట్ వైద్యం అందిందని తెలియజేశారు. ఈ విషయాన్ని స్వయంగా నాటి ముఖ్యమంత్రి రాజశేఖర్ రెడ్డి నిండు అసెంబ్లీలో ప్రస్తావించడం ఆయన పోరాటానికి నిదర్శనమని అన్నారు. ఎమ్మార్పీఎస్ కేవలం మాదిగ జాతి రిజర్వేషన్ ల కోసమే కాకుండా సమాజంలోని పేద బడుగు బలహీనవర్గాలతో పాటు అన్ని వర్గాల కోసం అనేక పోరాటాలు చేసిందన్నారు, ఎస్సీ ఎస్టీలకు ప్రమోషన్ల రిజర్వేషన్లు, తెల్ల రేషన్ కార్డుదారులకు రేషన్ కోటా పెంపు, వృద్ధులు వితంతువులు, వికలాంగులు ఒంటరి మహిళల పెన్షన్ల పెంపు, మహిళలపై జరుగుతున్న అత్యాచారాల నిరోధానికి ఫాస్ట్ ట్రాక్ కోర్టులు వంటి అంశాలలో ఎమ్మార్పీఎస్ కీలకపాత్ర పోషించిందని తెలియజేస్తూ సమాజంలో బడుగు బలహీన వర్గాల ప్రజలకు ఎక్కడ అన్యాయం జరిగిన ఎమ్మార్పీఎస్ వారికి అండగా ఉండి పోరాటంచేస్తుందనితెలియజేశారుఈ కార్యక్రమంలోఎమ్మార్పీఎస్, ఎంఎస్పి నాయకులు చిప్పలపల్లి మల్లేష్ మాదిగ, వంగాల శేఖర్ మాదిగ, పేరాల శివశంకర్ మాదిగ, సంపతి నరసయ్య మాదిగ, మల్లెపాక సుధాకర్ మాదిగ, మల్లెపాక గణేష్ మాదిగ, మల్లెపాక యలంధర్ మాదిగ, అందే మహేష్ మాదిగ, అందె నరేష్ మాదిగ, మామిడి శ్రావణ్ మాదిగ, దేశ గల రామస్వామి మాదిగ చిప్పలపల్లి విష్ణు మాదిగ , చిప్పలపల్లి బన్నీ మాదిగ పాల్వాయి విక్రమ్ మాదిగ, గడ్డం ఉమ శివ మాదిగ, మంద శ్రీకాంత్ మాదిగ, శేఖర్ మాదిగ, వేముల నాగరాజు మాదిగ, బూచిపాక సైదులు మాదిగ, పల్తేపురం పరశురాం మాదిగ, నరాల నరేష్ మాదిగ, మల్లెపాక గిరి, చిప్పలపల్లి అయోధ్య మాదిగ లు తదితరులు పాల్గొన్నారు.

# దశాబ్ద కాలం పోరాటం... ఎస్సీ కమిషన్ ఆదేశాలతో

**-యాదాద్రి పవర్ ప్లాంట్ వద్ద ఉమ్మడి సర్వే**





**మిర్యాలగూడ, ఆగస్టు 07,( ప్రజాజ్యోతి ):**
రాష్ట్రానికి వెలుగులు పంచేందుకు ఏర్పాటుచేస్తున్న 'యాదాద్రి ధర్మల్ పవర్ ప్రాజెక్ట్ ' కొందరు దళితుల జీవితాల్లో చీకట్లను నింపాయి. ' పవర్ ' ఉన్న వారికి బాసటగా నిలిచి జేబులు నింపిన పవర్ ప్రాజెక్ట్ ఏళ్ల తరబడి లక్షలు వెచ్చించి అటవీ భూముల్లో సాగు చేసుకుంటున్న తమను మాత్రం మాత్రం దగా చేసిందంటూ దళిత రైతులు ఆరోపిస్తున్నారు.. అందరిలా తమకూ నష్టపరిహారం అందజేయాలని ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ చెప్పులరిగేలా తిరిగినా.. ఏ స్థాయి అధికారి స్పందించలేదు... దీంతో అప్పట్లోనే జిల్లా కార్యాలయం ఎదుట నిరసన చేపట్టారు... ఈ నిరసన అనేక కుల సంఘాలతో పాటు... ప్రొఫెసర్ కోదండరాం లాంటి వారు మద్దతు పలికారు.. చివరకు ఎస్సి కమిషన్ ను ఆశ్రయించి తమగోడు వినిపించడంతో... స్పందించిన కమిషన్ భూమి సర్వే చేసి న్యాయం చేయాలని ఆదేశించడంతో..... ఎట్టకేలకు దశాబ్ద కాలం తర్వాత ఆటవీ, రెవిన్యూ అధికారులు సంయుక్త సర్వే నిర్వహించిన సంఘటన దామరచర్ల మండలం, వీర్లపాలెం శివారు యాదాద్రి ధర్మల్ పవర్ ప్రాజెక్టు వద్ద జరిగింది. బాధితులు తెలిపిన వివరాల మేరకు 2015 లో అప్పుడే తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన యాదాద్రి ధర్మల్ పవర్ ప్రాజెక్ట్ నిర్మాణం కోసం భూ సేకరణ చేసే సందర్భంలో వీర్లపాలెం గ్రామానికి చెందిన దళిత రైతులు కొందరు అనేక ఏళ్లుగా సర్వేనెంబర్ 96 లోని ఆటవీ భూముల్లో సాగు చేసుకుంటున్నారు. భూసేకరణ సందర్భంగా తాము భూములు ఇవ్వమని తెలిపినప్పటికీ నష్టపరిహారం అందిస్తామని,ఉద్యోగం ఇస్తామని నమ్మబలికి తమ వద్ద భూములు బలవంతంగా



లాక్కున్నారని తెలిపారు. అనంతరం అప్పటి కొందరి నాయకుల పైరవీలతో మంద ఇద్దయ్య, లింగయ్య, యేసయ్య కోటమ్మ భూలక్ష్మి నాగేంద్రబాబు తదితర రైతులకు పరిహారం ఇవ్వకుండా మొండి చేయి చూపారని ఆరోపిస్తున్నారు. ఈ విషయంపై అనేకసార్లు మండల స్థాయి నుండి జిల్లా స్థాయి అధికారుల వరకు ఫిర్యాదులు చేసినప్పటికీ పట్టించుకోలేదని ఆవేదన వ్యక్తం చేశారు. తమ నిరసనలో భాగంగా ఆత్మహత్య ప్రయత్నం చేయగా తిరిగి తమపైనే కేసులు బనాయించి పోలీస్ స్టేషన్లో హింసించారని ఆరోపించారు. ఈ క్రమంలో అప్పటిలోనే జిల్లా కార్యాలయం ఎదుట 12 రోజులపాటు నిరసన కార్యక్రమం చేపట్టగా వారి నిరసనకు అనేక కుల రాజకీయ సంఘాలు పార్టీలతో పాటు టీజేఎస్ పార్టీ అధ్యక్షుడు ప్రొఫెసర్ కోదండరాం మద్దతు ప్రకటించినట్లు తెలిపారు. ఇదే విషయాన్ని రాష్ట్ర ఎస్సీ కమిషన్ కు ఫిర్యాదు చేయగా, సర్వే నిర్వహించి బాధితులకు న్యాయం చేయాలంటూ ఎస్సి కమిషనర్ కిషోర్ కుమార్ మాక్వాన్ ఫిబ్రవరి 12న, జిల్లా కలెక్టర్ కు ఆదేశాలు జారీ చేశారు. అట్టి ఆదేశాల మేరకు శుక్రవారం దామరచర్ల తహసిల్దార్ జవహర్లాల్, డివిజన్ ఆర్ఐ హిమబిందు, డిఐ సర్వే యర్ రామకృష్ణారెడ్డి, అటవీ శాఖ రేంజర్, సిబ్బంది వై టి పి ఎస్ వద్ద ఉమ్మడి సర్వే నిర్వహించారు. దశాబ్ద కాలం తర్వాత అయినా తమ సమస్య పరిష్కారానికి అధికార యంత్రాంగం పూనుకోవడంతో ఇప్పటికైనా తమకు న్యాయం జరుగుతుందన్న ఆశాభావాన్ని దళిత రైతులు వ్యక్తం చేస్తున్నారు.

# బై రోజు లక్ష్మమ్మ కుటుంబ సభ్యులకు పదివేల రూపాయల ఆర్థిక సహాయం



**నార్కట్ పల్లి, ఆగస్టు 7 ( ప్రజా జ్యోతి ): .** మండల కేంద్రంలోని కొండపాకని గూడెం గ్రామంలో శు క్రవారం బైరోజు లక్ష్మమ్మ అకాల మరణంతోమృతి చెందగా వారి సభ్యులకు మునుగోడు శాసనసభ్యులు కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి 10000 రూపాయలు ఆర్థిక సహాయం అందజేశారు. అందజేసిన వారిలో మాజీ సర్పంచ్ కొమ్మనబోయినమల్లేష్ యాదవ్, మాజీ గ్రామ శాఖ అధ్యక్షుడు మామిడి సుధాకర్ రెడ్డి, దాసరి శివరాజ్ యాదవ్, మాజీ వార్డ్ మెంబర్ బైరోజుభీష్మ చారి, కొమురెల్లి రాజిరెడ్డి, గోపన బోయిన మల్లయ్య, కొమ్మనబోయిన యాదయ్య, పాల్గొన్నారు.

# తెలంగాణ సంస్కృతి వైభవానికి ప్రతీకగా ఎస్వీఆర్ టెక్నో స్కూల్‌లో బోనాల సంబరాలు

## -విద్యార్థుల బోనాలు, పోతురాజు వేషధారణ ప్రత్యేక ఆకర్షణ



**నడిగూడెం, ఆగస్టు 7, ప్రజా జ్యోతి:** మండల కేంద్రంలోని ఎస్వీఆర్ టెక్నో స్కూల్‌లో తెలంగాణ సంస్కృతి వైభవాన్ని ప్రతిబింబించేలా బోనాల పండుగను ఘనంగా నిర్వహించారు. విద్యార్థులు సంప్రదాయ దుస్తుల్లో బోనాలు ఎత్తుకొని అమ్మవారికి భక్తిశ్రద్ధలతో మొక్కులు సమర్పిస్తూ నృత్య ప్రదర్శనలు చేసి అందరినీ ఆకట్టుకున్నారు.పోతురాజు వేషధారణలో విద్యార్థుల సందడి వేడుకలకు మరింత శోభను తీసుకురాగా, పాఠశాల ప్రాంగణం బోనాల కళతో కళకళలాడింది. తెలంగాణ సంప్రదాయాలను భావితరాలకు పరిచయం చేసే ఉద్దేశంతో నిర్వహించిన ఈ కార్యక్రమం అందరి ప్రశంసలు అందుకుంది ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయులు కాసాని ఉపేందర్ మాట్లాడుతూ, విద్యార్థులు విద్యతో పాటు సంస్కృతి, సంప్రదాయాలను కూడా తెలుసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, సిబ్బంది, విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొని వేడుకలను విజయవంతం చేశారు.

# బోనాల పండుగ మన ఐక్యతను, సంస్కృతిని భావితరాలకు అందిస్తుంది

## -చండూరు మున్సిపల్ చైర్మన్ డాక్టర్ కోడి శ్రీనివాసులు.




**చండూరు, ఆగస్టు, 07(ప్రజా జ్యోతి):** చండూరు మున్సిపాలిటీలోని గాంధీజీ విద్యాసంస్థలలో శు క్రవారం నాడు బోనాల పండుగను ఘనంగా నిర్వహించారు. చండూరు మున్సిపల్ చైర్మన్, ట్రస్మా జిల్లా అధ్యక్షులు డాక్టర్ కోడి శ్రీనివాసులు మహాకాళి, పోచమ్మ, ఎల్లమ్మ దేవతలకు బోనం పెట్టి, పూజలు నిర్వహించి ఘనంగా బోనాల పండుగను ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మన తెలంగాణ రాష్ట్ర సాంస్కృతిక వైభవానికి, ఆత్మగౌరవానికి ప్రతీక అయిన అత్యంత పవిత్రమైన పండుగ బోనాల పండుగ అని అన్నారు. ప్రతి ఏటా ఆషాఢ మాసంలో తెలంగాణ అంతట బోనాల పండుగ ఘనంగా జరుపుకుంటారని, ఇది మన రాష్ట్ర అధికారిక పండుగని అన్నారు. విద్యార్థులకు బోనం విశిష్టతను తెలియజేస్తూ, బోనం అంటే భోజనం అని, అమ్మవారికి నైవేద్యంగా వండిన అన్నం, పాలు, బెల్లం కుండలో సమర్పిస్తారని, మహిళలు కొత్త కుండలకు పసుపు, కుంకుమ, వేపాకులతో అలంకరించి, తలపై పెట్టుకుని వస్తారని తెలిపారు. శివసత్తుల పూనకాలు, పోతురాజుల విన్యాసాలతో ఊరంతా పండుగ వాతావరణం ఉంటుందని,అంటువ్యాధుల నుండి కాపాడమని అమ్మవారికి నీ వేడుకొని కృతజ్ఞతగా ఈ జాతర జరుపుకోవడం మన ప్రాచీన ఆచారం అని తెలిపారు. ఈ పండుగ మన ఐక్యతను, సంస్కృతిని భావితరాలకు అందిస్తుందని అన్నారు, 9 మంది విద్యార్థులు 9 దేవత రూపాల్లో దర్శనం ఇవ్వడం, మరి కొంత మంది విద్యార్థులు పోతురాజుల వేషధారణలో వారిని నృత్యాలు, విన్యాసాలతో విద్యార్థులను వారి తల్లిదండ్రులను ఎంతగానో ఆకర్షించారు. ఈ కార్యక్రమంలో గాంధీజీ విద్యాసంస్థ డైరెక్టర్ సరికొండ వెంకన్న, ప్రిన్సిపాల్ జాని,చిలుకూరి రామేశ్వరి, కందుల కృష్ణయ్య, ఉపాధ్యాయిని ఉపాధ్యాయులు, విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు.

# పత్తి పంటలో నానో యూరియా, నానో డి.ఏ.పి వాడకంపై క్షేత్ర పరిశీలన



**పెన్ పహాడ్ ఆగస్టు 7 (ప్రజా జ్యోతి):** మండల పరిధిలోని మాచారం గ్రామంలో సైదులు యొక్క పత్తి పంటలోనానో యూరియా, నానో డి.ఏ.పి వాడే పద్ధతి పై క్షేత్ర పరిశీలన నిర్వహించినట్లు గడ్డిపల్లి కే. వి. కే శాస్త్రవేత్త అరిగేల కిరణ్ తెలిపారు.ఈ కార్యక్రమంలో రైతులు పాత పద్ధతుల్లో పాటు కొత్త టెక్నాలజీ వినియోగించుకోవాలని నానో టెక్నాలజీ ద్వారా ఎరువుల యొక్క వినియోగశాతం పెరుగుతుందని తెలిపారు.ఆఖరి దుక్కిలో వేసేటువంటి రసాయన ఎరువులను ఇరవై ఐదు శాతం తగ్గించుకొని పై పాటుగా పత్తి విత్తిన ఇరవైఐదు రోజులనుంచి ముప్పై రోజులకు ఒక్కసారి మరియు నలభై - అరవై రోజులకు ఒక్కసారి ఒక లీటర్ నీటికి మూడు నుంచి నాలుగు మీ. లీ.శ్రీ.శ్రీ చొప్పున కలిపి పిచికారి చేయాలి అని తెలిపారు. ఈ కార్యక్రమంలో కె.వి.కె గడ్డిపల్లి సస్యరక్షణ శాస్త్రవేత్త డి .ఆదర్శ్ పత్తిలో తొలి దశలో ఆశించే రసం పీల్చే పురుగుల యొక్క నివారణ గురించి తెలిపారు. తర్వాత ఎంపిక చేసిన ఐదుగురు రైతులకి నానో యూరియా ప్లస్, నానో డీఏపీని అందజేయడం జరిగింది.ఈ కార్యక్రమంలో రైతులు లింగయ్య, ఐక్కయ్య, తదితరులు పాల్గొన్నారు.

# పారిశుద్ధ్య కార్మికుల ఆరోగ్యంపై ప్రత్యేక దృష్టి

## - మున్సిపల్ చైర్మన్ చింతల చంద్రారెడ్డి




**హాలియా,ఆగస్టు7(ప్రజా జ్యోతి):** పట్టణాన్ని పరిశుభ్రంగా, ఆరోగ్యవంతంగా తీర్చిదిద్దడంలో మున్సిపల్ పారిశుద్ధ్య సిబ్బంది అందిస్తున్న సేవలు అనితరసాధ్యమని హాలియా మున్సిపల్ చైర్మన్ చింతల చంద్రారెడ్డి కొనియాడారు. శుక్రవారం పారిశుద్ధ్య కార్మికులకు మున్సిపల్ చైర్మన్ ఆధ్వర్యంలో పర్సనల్ ప్రొటెక్టివ్ ఎక్విప్‌మెంట్ (పీపీఈ) కిట్లు, రేడియం జాకెట్లు, యూనిఫాంలు,సబ్బులు, హెయిర్ ఆయిల్,అత్యవసర రక్షణ సామగ్రిని పంపిణీ చేశారు.ఈ సందర్భంగా చైర్మన్ మాట్లాడుతూ క్షేత్రస్థాయిలో నిత్యం శ్రమిస్తున్న సిబ్బంది ఆరోగ్య భద్రత,సంక్షేమానికి తమ ప్రభుత్వం,పాలకవర్గం అత్యున్నత ప్రాధాన్యతనిస్తుందని స్పష్టం చేశారు.కార్మికులకు ప్రభుత్వం నుండి అందాల్సిన అన్ని రకాల సంక్షేమ ఫలాలు,లబ్ధిని సమర్థవంతంగా చేరవేసేందుకు నిరంతరం కృషి చేస్తామని పునరుద్ఘాటించారు.అనంతరం మున్సిపల్ కమిషనర్ కె.రవీందర్ రెడ్డి మాట్లాడుతూ సిబ్బంది భవిష్యత్ భద్రతను దృష్టిలో ఉంచుకుని ఈపీఎఫ్, ఈఎస్ఐ చెల్లింపులను క్రమం తప్పకుండా చెల్లిస్తున్నామని తెలిపారు.ఈ పథకాల ద్వారా చేకూరే ఆర్థిక,వైద్య ప్రయోజనాలపై అవగాహన కలిగి ఉండాలని,వాటిని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.ఈ కార్యక్రమంలో కౌన్సిలర్ సలహాదారులు నకిరేకంటి సైదులు,కడమంచి శ్రీను,మజహార్ మొహినుద్దీన్ కౌన్సిలర్ దేపావత్ ప్రసాద్ నాయక్,కో-ఆప్షన్ సభ్యులు రషీద్,మున్సిపల్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

# డాక్టర్ ముత్తు దాతృత్వం అభినందనీయం

## -విద్యార్థులకు స్కూల్ డైరీల పంపిణీ



**నడిగూడెం, ఆగస్టు 7, ప్రజా జ్యోతి:** దాతలు చేసే సేవలు అభినందనీయమని నడిగూడెం గ్రామ సర్పంచ్ దున్నా శ్రీనివాస్ అన్నారు. శుక్రవారం శ్రీ కొల్లు పాపయ్య జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ప్రధానోపాధ్యాయురాలు కే. శ్రీదేవి అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ఎస్ఐ తేజస్వినితో కలిసి విద్యార్థులకు స్కూల్ డైరీలను పంపిణీ చేశారు.ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ, చిలుకూరు మండలం కట్టకొమ్ముగూడెం గ్రామానికి చెందిన డాక్టర్ వేముల ముత్తు, మిజోరాం సెంట్రల్ యూనివర్సిటీలో ప్రొఫెసర్గా పనిచేస్తూ ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు డైరీలు అందించడం ఆయన విద్యాపట్ల ఉన్న సేవాభావానికి నిదర్శనమన్నారు. విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని ఉన్నత లక్ష్యాలు సాధించాలని సూచించారు.కార్యక్రమంలో ఎఎస్ఐ శ్రీనివాస్ రెడ్డి, ఉపాధ్యాయులు డా. కత్తి వెంకటేశ్వర్లు, షేక్ మీరాజుద్దీన్, ఎండి మౌలానా, కే. అశోక్ గౌడ్ తదితరులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## పిలాయిపల్లి కాలువ రైతులకు త్వరలో న్యాయం

### - కాంగ్రెస్ జిల్లా ఉపాధ్యక్షుడు కళ్లెం రాఘవరెడ్డి



**భూదాన్ పోచంపల్లి, ఆగస్టు 07 (ప్రజాజ్యోతి):** మండలంలోని పిలాయిపల్లి కాలువ నిర్మాణానికి సంబంధించి భూసేకరణ ప్రక్రియ 2010లోనే పూర్తయిందని కాంగ్రెస్ పార్టీ యాదాద్రి భువనగిరి జిల్లా ఉపాధ్యక్షుడు కళ్లెం రాఘవరెడ్డి తెలిపారు. కాలువ నిర్మాణం కోసం అప్పట్లో రైతుల నుంచి భూములు తీసుకున్నప్పటికీ, పలువురు రైతులకు సంబంధించిన పరిహారం, భూ వివరాల విషయంలో సమస్యలు కొనసాగుతున్నాయని పేర్కొన్నారు. ఇటీవల కాలంలో రైతులకు భూసేకరణకు సంబంధించిన పరిహారం చెల్లింపుల ప్రక్రియ కొనసాగుతోందని ఆయన తెలిపారు. అయితే కొంతమంది రైతులకు సంబంధించిన భూముల వివరాలు, సర్వే నంబర్లు, భూ విస్తీర్ణం తదితర అంశాల్లో స్పష్టత అవసరముందని అన్నారు. ఈ నేపథ్యంలో రైతులకు ఎలాంటి అన్యాయం జరగకుండా భూములన్నింటినీ సమగ్రంగా సర్వే చేయించాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. భువనగిరి ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్ రెడ్డి సహకారంతో సంబంధిత అధికారులతో సమన్వయం చేసుకుని పిలాయిపల్లి కాలువ పరిధిలోని రైతుల భూములను సర్వే చేయిస్తామని కళ్లెం రాఘవరెడ్డి తెలిపారు. భూములు కోల్పోయిన ప్రతి అర్హత కలిగిన రైతుకు న్యాయం జరిగేలా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. భూ సమస్యలను పరిష్కరించేందుకు అధికారుల దృష్టికి తీసుకెళ్లి, అవసరమైన చర్యలు చేపట్టేలా కృషి చేస్తామని ఆయన తెలిపారు. పిలాయిపల్లి కాలువ భూ సమస్యకు శాశ్వత పరిష్కారం చూపడంతో పాటు రైతులకు రావాల్సిన న్యాయమైన పరిహారం అందేలా ప్రజాప్రతినిధులు, అధికారులు కలిసి పనిచేయాలని కళ్లెం రాఘవరెడ్డి కోరారు.

## చీదేళ్ల శ్రీలక్ష్మి తిరుపతమ్మ గోపయ్య స్వామి దేవాలయంలో నిత్య దూప దీప నైవేద్యం



**పెన్ పహాడ్, ఆగస్టు 7 (ప్రజా జ్యోతి):** మండల పరిధిలోని చీదేళ్ల గ్రామంలో శ్రీ లక్ష్మీ తిరుపతమ్మ గోపయ్య స్వాములకు నిత్య దూప దీప నైవేద్యం ఏర్పాటుకు గ్రామపెద్దలు నిర్ణయం తీసుకోవడం జరిగింది. శతాబ్ద కాలం నుండి కొలువై ఉన్న శ్రీ లక్ష్మీ తిరుపతమ్మ గోపయ్య స్వామి దేవాలయ ప్రాంగణంలో నిత్య దూప దీప నైవేద్య కార్యక్రమానికి ఆలయ కమిటీ శ్రీకారం చుట్టింది. ఆలయ ఆవరణలో వేంచేసి ఉన్న ఉప దేవతలైన అంకాలమ్మ తల్లి, గంగమ్మ తల్లి, నాగదేవత, సీతారామాంజనేయ స్వామి వార్లకు ఇకపై నిరంతరాయంగా నిత్య నైవేద్య సమర్పణ, పూజలు నిర్వహించాలని ఆలయ కమిటీ నిర్ణయించింది. ఈ విషయమై ఆలయ అర్చకులు గోపయ్య స్వామితో కమిటీ ప్రతినిధులు చర్చించి, నిత్య పూజలు, నైవేద్యాలు, పూజ సామాగ్రి ఖర్చుల నిమిత్తం నెలకు 12,000 రూపాయల వ్యయం అవుతుందని నిర్ణయించారు. ఈ కార్యక్రమం శ్రావణ మాసం మొదటి శుక్రవారం ఈనెల 14 నుండి ప్రారంభం కానుంది. ఈ మహత్కార్యానికి భక్తులు, దాతలు తమకు తోచిన ఆర్థిక సహాయాన్ని అందించి సహకరించాలని గ్రామ సర్పంచ్ వరికల్లు పద్మ శ్రీనివాస్, దేవాలయ కమిటీ చైర్మన్ రణబోతు శ్రీనివాస్ రెడ్డి, వైస్ చైర్మన్ కీర్తి యలమంచయ్య గౌడ్, ఒక ప్రకటనలో విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ దేవరం ప్రభాకర్ రెడ్డి, బిజీగ గోపి, పరెడ్డి లింగారెడ్డి, బంగారు చంద్రశేఖర్, గద్దం ధర్మయ్య, పరెడ్డి లింగారెడ్డి, గొట్టిపర్తి గోపయ్య, జాల సైదులు, బాదరబోయిన వీరబాబు, వెన్న గోపిరెడ్డి, గొట్టిపర్తి గోవిందయ్య, తొండల గోపయ్య, వజ్రపు వెంకటేశ్వర్లు కమిటీ సభ్యులు, భక్తులు తదితరులు పాల్గొన్నారు.

## ఈ నెల 10న సీఎం రేవంత్ రెడ్డి సాగర్ పర్యటన

### - నాగార్జునసాగర్ లో సీఎం వరుణ యాగం - ఏర్పాట్లను పరిశీలించిన జిల్లా కలెక్టర్ బడుగు చంద్రశేఖర్





**హాలియా, ఆగస్టు 7 (ప్రజా జ్యోతి):** రాష్ట్రంలో వర్షాలు సమృద్ధిగా కురిసి జలాశయాలు జలకళతో తొలకాడాలని, రైతాంగం సుభిక్షంగా ఉండాలనే సత్సంకల్పంతో ఈ నెల 10వ తేదీన నాగార్జునసాగర్ విజయ విహార్ వేదికగా నిర్వహించనున్న 'మహా వరుణ యాగం' ఏర్పాట్లను నల్గొండ జిల్లా కలెక్టర్ బి. చంద్రశేఖర్ శుక్రవారం పరిశీలించారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఈ ఆధ్యాత్మిక క్రతువుకు ముఖ్య అతిథిగా హాజరుకానున్నారనే ముందస్తు సమాచారంతో, కలెక్టర్ విజయ విహార్ ప్రాంగణాన్ని స్వయంగా సందర్శించి వివిధ శాఖల ధికారులతో సమగ్రసమీక్ష నిర్వహించారు. యాగస్థలి, ప్రవచనశాల, భక్తులకు కల్పించాల్సిన వసతులపై దేవాదాయ, రెవెన్యూ, పోలీసు శాఖల అధికారులకు ఆయన దిశానిర్దేశం చేశారు. ముఖ్యమంత్రి పర్యటన దృష్ట్యా ఎటువంటి లోటుపాట్లకు తావులేకుండా అత్యున్నత భద్రతా ప్రమాణాలు, మౌలిక సదుపాయాలు తక్షణమే పూర్తి చేయాలని ఆదేశించారు. యాగశాల, ప్రవచన వేదిక, పటిష్టమైన బారికేడింగ్, వాటర్‌ప్రూఫ్ టెంట్లు, ఎల్ఈడీ స్క్రీన్లు, సుస్పష్టమైన పబ్లిక్ అడ్రస్ సిస్టమ్‌ను సిద్ధం చేయాలని పేర్కొన్నారు. యాగాన్ని శాస్త్రోక్తంగా నిర్వహించేందుకు వివిధ ప్రాంతాల నుండి విచ్చేసే ఋత్విక్కులు, అర్చకులకు ముందురోజు నుంచే వసతి, రక్షిత తాగునీరు, అల్పాహార, భోజన సదుపాయాలను అత్యుత్తమ రీతిలో కల్పించాలని అధికారులను ఆదేశించారు. యాగ వీక్షణకు, ప్రవచనాలు వినేందుకు తరలివచ్చే వేలాది మంది సాధారణ ప్రజలకు, వీఐపీలకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా ప్రత్యేక మార్గాలు, ఆసీనులయ్యే ఏర్పాట్లు వేర్వేరుగా చేయాలన్నారు. విజయవిహార్ పరిసర ప్రాంతాలలో పారిశుద్ధ్యం లోపించకుండా మున్సిపల్ కమిషనర్ కోటేశ్వరరావు ప్రత్యేక శ్రద్ధ వహించాలని స్పష్టం చేశారు. ఈ మహా క్రతువుకు ముఖ్యమంత్రితో పాటు పలువురు మంత్రులు, పార్లమెంట్ సభ్యులు, ఎమ్మెల్సీలు, ఎమ్మెల్యేలు, ప్రజాప్రతినిధులు పెద్ద సంఖ్యలో హాజరుకానున్నందున, పోలీసు శాఖ ఆధ్వర్యంలో పకడ్బందీ బందోబస్తు ప్రణాళికను సిద్ధం చేసి, యాగస్థల రూట్‌రేఖల ప్లాన్‌ను సమర్పించాలని సూచించారు. కార్యక్రమంలో అదనపు ఎస్పీ రమేష్, మిర్యాలగూడ ఆర్డీవో రమణారెడ్డి, యాదాద్రి దేవాలయ డిప్యూటీ ఈవో డి. భాస్కర్, జిల్లా దేవాదాయ శాఖ అసిస్టెంట్ కమిషనర్ కే. భాస్కర్, డీఎస్పీ రవి, ఆర్ఐ శ్రీనివాస రెడ్డి, సాగర్ సీఐ శ్రీను నాయక్, పట్టణ ఎస్ఐ సతీష్ పలువురు ప్రభుత్వ అధికారులు పాల్గొన్నారు.



## దళిత క్రైస్తవుల కు ఎస్సీ హోదా కల్పించేంతవరకు ఐక్యమత్యంతో ఉద్యమించాలి

### -పి. డేవిడ్ రాజ్



**నల్గొండ ఆగస్టు 7, (ప్రజా జ్యోతి ):** దళిత క్రైస్తవులకు ఎస్సీ హోదా కల్పించేంతవరకు క్రైస్తవులందరూ ఐక్యమత్యంతో ఉద్యమించాలని యునైటెడ్ దళిత క్రిస్టియన్స్ ఫెడరేషన్ జనరల్ సెక్రెటరీ పి. డేవిడ్ రాజ్, చీఫ్ అడ్వైసర్ తలకొప్పుల క్రిస్టాపర్ పిలుపునిచ్చారు. శుక్రవారం పట్టణంలోని సెంటినరీ బాప్టిస్ట్ చర్చ్ కమ్యూనిటీ హాల్ లో జరిగిన సమావేశంలో యునైటెడ్ దళిత క్రిస్టియన్స్ ఫెడరేషన్ నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దళిత క్రైస్తవులకు ఎస్సీ హోదా కల్పించే పోరాటంలో భాగంగా ఉమ్మడి నల్లగొండ జిల్లా వ్యాప్తంగా నూతన కమిటీని ఎన్నుకోవడం జరిగిందని వారు తెలిపారు. గౌరవ సలహాదారు. ప్రొఫెసర్ వి. నతనియెలు, చీఫ్ అడ్వైసర్. తలకొప్పుల క్రిస్టాపర్, అధ్యక్షుడు డిఐ సంసోన్, ఉపాధ్యక్షుడు జేపీ సాల్మన్ రాజు, జనరల్ సెక్రెటరీ పి డేవిడ్ రాజు, ట్రెజరర్ ఆదిమల్ల ప్రభుదాసు, ఆర్గనైజింగ్ సెక్రెటరీ డి ఎవినేజర్, జాయింట్ సెక్రెటరీ దుబ్బాసి ప్రేమ్ కుమారు. ఎగ్జిక్యూటివ్ మెంబర్ లు బొంగరాల సమాదానం, మద్దెల చంద్ర పాలు. అజర్య నాయక్. అడ్వైజర్ పి జేమ్స్ ఎన్నికయ్యారని వారు పేర్కొన్నారు. వీరితో పాటు ప్రతి నియోజకవర్గానికి ఒక్కొకరిని మొత్తం 40 మంది ని నియమించడం జరిగిందన్నారు. యూ డి సి ఎఫ్ వేదిక ద్వారా కార్యవర్గ సభ్యులు పాస్టర్లు సంఘ పెద్దలు దళిత క్రైస్తవులకు ఎస్సీ హోదా కల్పించే అంతవరకు ముక్తకంఠంతో ముందుకు సాగాలని వారు పిలుపునిచ్చారు. అదేవిధంగా దేశవ్యాప్తంగా దళిత క్రైస్తవుల మీద జరుగుతున్న అక్రమ దాడులను అరికట్టాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో దళిత క్రైస్తవులు, పాస్టర్లు, సంఘ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## ఎంపీ చామల కీలక బాధ్యత నియామకంపై హర్షం వ్యక్తం



**రామన్నపేట, ఆగస్టు 7 (ప్రజా జ్యోతి):** ఏఐసీసీ తెలంగాణ పీసీసీ మీడియా మరియు ప్రచార కమిటీ చైర్మన్ గా భువనగిరి ఎంపీ చామల కిరణ్ కుమార్ రెడ్డిని తెలంగాణ కాంగ్రెస్ కమిటీ నియమించింది. ఈ నియామకంపై మాజీ ఎంపీటీసీ, మాజీ డిసిసి ప్రధాన కార్యదర్శి తాటిపాముల శేఖర్ గౌడ్ హర్షం వ్యక్తం చేశారు. రాష్ట్రంలో కాంగ్రెస్ మరోసారి అధికారంలోకి వస్తుందని, తెలంగాణకు రావాల్సిన నిధులు రాబట్టడంలో ఎంపీ చామల కీలకంగా ఉంటారని తెలిపారు. ఈ అవకాశం కల్పించిన ఏఐసీసీ అధ్యక్షులు మల్లికార్జున ఖర్గే, రాహుల్ గాంధీ, సోనియా గాంధీ, ప్రియాంక గాంధీ గార్లకు కృతజ్ఞతలు తెలిపారు.

# చదివే వీలు లేకపోతే వారి భవిష్యత్తుకు భరోసా ఏది

## బధిర,దృష్టిలోపం విద్యార్థులకు ప్రత్యేక డిగ్రీ కళాశాల ఏర్పాటు కోసం ప్రయత్నించాలంటూ ఎమ్మెల్యే కు వినతి

**మిర్యాలగూడ, ఆగస్టు 07,(ప్రజాజ్యోతి):** తెలంగాణ రాష్ట్రంలో బదిరులు (చెవిటి, మూగ), దృష్టిలోపం ఉన్న విద్యార్థుల ఉన్నత భవిష్యత్తు కోసం డిగ్రీ కళాశాల ఏర్పాటుకు ప్రయత్నించాలంటూ మిర్యాలగూడ ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి ని కోరారు. బీసీ చైతన్య విద్యార్థి విభాగం రాష్ట్ర అధ్యక్షులు నగేష్ సూర్యవంశం. మిర్యాలగూడ పట్టణంలోని స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో కొనసాగుతున్న ఏకైక బదిరుల జూనియర్ కళాశాలకు శుక్రవారం విచ్చేసిన నగేష్ మాట్లాడుతూదివ్యాంగులకు అందుబాటులో సమ్మిళిత విద్య, సంక్షేమం మరియు సాధికారతను ప్రోత్సహించే లక్ష్యంతో ఆంధ్రప్రదేశ్ లో ఉన్న కూటమి ప్రభుత్వం దివ్యాంగుల కోసం ఇంద్రదనుస్సు సమ్మిళిత అభివృద్ధి కార్యక్రమంను ప్రకటించారని,ఈ కార్యక్రమం కింద బాపట్ల వెదుళ్లపల్లి లో వినికిడి లోపం ఉన్న విద్యార్థుల కోసం ప్రత్యేకంగా ఒక ప్రభుత్వ డిగ్రీ కళాశాలను ఏర్పాటు చేసిందన్నారు. ఈ విద్యా సంవత్సరం నుంచి బీకామ్ (కంప్యూటర్ ఆప్లి కేషన్స్), ఏఐ సర్టిఫికేషన్ కోర్సులు ప్రస్తుతం అందుబా టులో ఉన్నాయన్నారు. 30 మంది విద్యార్థులకు ఇందులో ప్రవేశాలు కల్పించనున్నారని తెలిపారు. పథకం కింద ఈ మేరకు 14 మంది బోధన, బోధ నేతర పోస్టుల్ని మంజూరు చేసేందుకు జీవో 16 ద్వారా ప్రభుత్వం అనుమతి ఇస్తూ ఉత్తర్వులు జారీ చేసిందని,వచ్చే ఏడాది నుంచి మరికొన్ని కోర్సులు ప్రారంభించే అవకాశం ఉందన్నారు. తెలంగాణలో సాధారణ విద్యార్థుల కోసం వందల సంఖ్యలో ప్రభుత్వ డిగ్రీ కళాశాలలు ఉన్నప్పటికీ, సైన్ లాంగ్వేజ్ ( సంజ్ఞల ) ద్వారా బధిర విద్యార్థుల కోసం బోధించే అధ్యాపకులు కలిగిన ప్రత్యేక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలు లేవన్నారు.బదిర విద్యార్థులభవిష్యత్తు ను దృష్టిలో పెట్టుకొని అప్పటి ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం కడప, ఏలూరు, మిర్యాలగూడలో బదిర విద్యార్థుల కోసం అదనపు సెక్షన్స్ ఏర్పాటు చేసి వారికి బోధించుటకు గాను జీ.వో 212 ను 2010 -2011 లో విడుదల చేసిందని గుర్తు చేశారు. ఇంటర్ పూర్తి చేసిన తర్వాత, ప్రత్యేక శిక్షణ ఇచ్చే డిగ్రీ కళాశాలలు అందుబాటులో లేక,



సాధారణ కళాశాలల్లో చేరితే అక్కడ బోధన అర్థం కాక, చాలామంది బదిర విద్యార్థులు తమ చదువును ఇంటర్ విద్యతో ఆపేస్తున్నారు అని ఆవేదన వ్యక్తం చేశారు.ఇంటర్మీడియట్, డిగ్రీ అర్హతలతోప్రభుత్వ ఉద్యోగ నియామకాలు చేపట్టేటప్పుడు వారికీ 5 శాతం రిజర్వేషన్ ఉంటుందని,కానీ చదువుకునేఅవకాశాలు, విద్యాలయాలు అందుబాటులోలేనప్పుడు దివ్యాంగులు ఆ ఉద్యోగాలకి ఎలా అప్లై చేసుకుంటారనిప్రశ్నించారు. గత తెలంగాణ ప్రభుత్వంలో ఉచిత నిర్బంద విద్య అన్నారు, కానీ బధిర, దృష్టిలోపం విద్యార్థులను పూర్తిగా పక్కన పెట్టారని ఆవేదన వ్యక్తం చేశారు. నేడు కాంగ్రెస్ ప్రభుత్వం ఇంటిగ్రేటెడ్ ఎడ్యుకేషన్ సిస్టం అనిఅంటున్నారు, దానిలో నైనా ఈ బధిర, దృష్టిలోపంవిద్యార్థులకు విద్యా అవకాశాలు కలిపిస్తూ,స్కిల్ డెవలప్మెంట్ ప్రోగ్రాం లో భాగం చేయాలి అని కోరారు.దివ్యాంగులకు సమ్మిళిత విద్య, సంక్షేమం,సాధికారతను పెంపొందించే కార్యక్రమంలో భాగంగా బధిరుల(చెవిటి, మూగ), దృష్టిలోపం విద్యార్థుల కోసం తెలంగాణ వ్యాప్తంగా ఉన్న ప్రభుత్వ పాఠశాలలో, ప్రభుత్వ జూనియర్, డిగ్రీ, అన్ని రకాల విద్యాలయాల్లో అదనపు సెక్షన్లు ఏర్పాటు చేసి హాస్టల్ సదుపాయం కల్పించాలని కోరారు. అనంతరం ఆయన కళాశాలకు విచ్చేసిన స్థానిక మిర్యాలగూడ ఎమ్మెల్యే బత్తుల లక్ష్మా రెడ్డి ని కలిసి బధిర విద్యార్థుల కోసం డిగ్రీ కళాశాల ను ఏర్పాటు చేసేలా సీఎం రేవంత్ రెడ్డి,ప్రభుత్వంతో మాట్లాడాలని ఆయనకు వినతి పత్రాన్ని అందించారు.

# మా నిధులు మాకివ్వాల్సిందే!

**- ఆర్డీఓ కార్యాలయాన్ని ముట్టడించిన బీజేపీ శ్రేణులు**

**- చౌటుప్పల్‌లో హోరెత్తిన ప్రదర్శన.. వైఖరి మారకపోతే ఉద్యమం ఉధృతం**

**- కాంగ్రెస్ నాయకులకు కొమ్ముకాస్తున్నారని అధికారులపై గంగిడి మోనోహర్ రెడ్డి,కాసం వెంకటేశ్వర్లు ధ్వజం**







**చౌటుప్పల్, ఆగస్టు 7 ( ప్రజా జ్యోతి ):** ఉపాధి హామీ నిధుల కేటాయింపులో బీజేపీకి చెందిన సర్పంచులు, కౌన్సిలర్ల పట్ల స్థానిక ఎమ్మెల్యే, అధికారులు తీవ్ర వివక్ష చూపుతున్నారని బీజేపీ రాష్ట్ర నాయకుడు గంగిడి మనోహర్‌రెడ్డి, కాసం వెంకటేశ్వర్లు ధ్వజమెత్తారు. ప్రతిపక్ష ప్రజాప్రతినిధులకు నిధులు దక్కకుండా వేధిస్తున్నారని మండిపడ్డారు. అధికారుల పక్షపాత వైఖరిని నిరసిస్తూ శుక్రవారం చౌటుప్పల్‌లో బీజేపీ శ్రేణులు భారీ ఆందోళన చేపట్టాయి.చౌటుప్పల్‌లోని నాగులకుంట నుంచి ప్రారంభమైన నిరసన ప్రదర్శన ఆర్‌డీఓ కార్యాలయం వరకు హోరెత్తింది. చౌటుప్పల్, సంస్థాన్ నారాయణపురం మండలాలకు చెందిన బీజేపీ సర్పంచులు, మున్సిపల్ కౌన్సిలర్లు, నాయకులు పెద్ద సంఖ్యలో పాల్గొని ప్రభుత్వానికి, అధికారులకు వ్యతిరేకంగా పెద్దఎత్తున నినాదాలు చేశారు. అనంతరం ఆర్‌డీఓ కార్యాలయం ఎదుట బైఠాయించి ధర్నా నిర్వహించారు. కార్యాలయంలోకి వెళ్లి నిధుల కేటాయింపుపై అధికారులను నిలదీశారు.ఈ సందర్భంగా గంగిడి మనోహర్‌రెడ్డి, కాసం వెంకటేశ్వర్లు మాట్లాడుతూ.. ఆర్‌డీఓ, ఎంపీడీఓలు కాంగ్రెస్ పార్టీ నాయకులకు అనుకూలంగా వ్యవహరిస్తూ ప్రజాస్వామ్య సూత్రాలను కాలరాస్తున్నారని ఆరోపించారు. బీజేపీ గెలిచిన పంచాయతీలు, వార్డుల్లో అభివృద్ధి పనులు జరగకుండా ఉద్దేశపూర్వకంగా నిధులు నిలిపివేస్తున్నారని మండిపడ్డారు. నిధుల కేటాయింపు ఏ ప్రాతిపదికన జరుగుతుందో అధికారులు వెంటనే స్పష్టత ఇవ్వాలని డిమాండ్ చేశారు. అధికారుల తీరు మారకపోతే బాధితులతో కలిసి ఆందోళనలను మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు.ఈ కార్యక్రమంలో బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు నాగం వర్షిత్ రెడ్డి, దూడల బిక్షం గౌడ్, దోనూరి వీరరెడ్డి, చాగ చంద్రశేఖర్ రెడ్డి, పిట్టల శ్రీనివాస్, సతీష్ యాదవ్, పాలకుర్ల జంగయ్య, ఉడుగు యాదయ్య, గుజ్జుల సురేందర్ రెడ్డి, బత్తుల జంగయ్య, రామనగోని శంకర్, బుడ్డ సురేష్, అలే చిరంజీవి, పోల్లేపల్లి లక్ష్మీ, కైరం కొండ స్వప్న అశోక్, ఉడుగు వెంకటేశం,అల్మాసిపేట గౌతమ్, శ్రీధర్ బాబు, దిండు భాస్కర్, కాయితీ రమేష్ గౌడ్, బోయ సదానందం తదితరులు పాల్గొన్నారు.

# క్రీడలు స్నేహభావాన్ని పెంపొందిస్తాయి

**-ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి పవన్ కుమార్**



**మిర్యాలగూడ,ఆగస్టు 07,( ప్రజాజ్యోతి ):** క్రీడలు శారీరక, మానసిక వికాసంతో పాటు , స్నేహభావాన్ని పెంపొందిస్తాయని మిర్యాలగూడ ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జ్ పవన్ కుమార్ అన్నారు.భారతదేశ 80వ, స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలను పురస్కరించుకుని మిర్యాలగూడ బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో న్యాయవాదుల కొరకు నిర్వహించనున్న క్రీడా పోటీలను శుక్రవారం మొదటి జూనియర్ సివిల్ జడ్జి ఎం. లావణ్య రాణి,రెండవ జూనియర్ సివిల్ జడ్జి వి.అరుణ్ తేజ్ లతో కలిసి ప్రారంభించారు. ?అతిథులందరూ కలిసి క్యారమ్ బోర్డు ఆటను ఆడారు.ఈ సందర్భంగా న్యాయమూర్తులు మాట్లాడుతూ నిత్యం వృత్తిగత ఒత్తిడితో సతమతమయ్యే న్యాయవాదులకు క్రీడలుమానసికోల్లాసాన్ని, శారీరక ధృడత్వాన్ని ఇస్తాయన్నారు. ఇలాంటి పోటీలు పరస్పర సోదరభావాన్ని పెంపొందిస్తాయన్నారు. న్యాయవాదులంతా క్రీడా పోటీలలో పాల్గొని తమ ప్రతిభను చూపాలన్నారు.ఈ కార్యక్రమంలో మిర్యాలగూడ బార్ అసోసియేషన్ అధ్యక్షుడు గౌరు వెంకటేశ్వర్లు, ఉపా ధ్యక్షుడు ఇసరం కరుణాకర్, ప్రధాన కార్యదర్శి జంగిలి ఎల్లయ్య, సంయుక్త కార్యదర్శి రాయారపు భాస్కర్, కోశాధికారి రెడ్డిపల్లి సైదులు, గేమ్స్ సెక్రటరీ భూక్యా రమేష్, బార్ అసోసియేషన్ గౌరవ సభ్యులైన న్యాయవాదులందరూ పెద్ద సంఖ్యలో విచ్చేసి ప్రారంభోత్సవ క్రీడా పోటీలనువిజయవంతం చేశారు.

# యోగా శారీరక, మానసిక ఆరోగ్యానికి అద్భుతమైన సహజ ఔషధం



**నాంపల్లి, ఆగస్టు, 7(ప్రజా జ్యోతి ):** యోగా శారీరక, మానసిక ఆరోగ్యానికి ఒక అద్భుతమైన సహజ ఔషధం లాంటిదని ట్రస్మా జిల్లా అధ్యక్షులు, గాంధీజీ విద్యాసంస్థల చైర్మన్ డాక్టర్ కోడి శ్రీనివాసులు అన్నారు. శుక్రవారం నాంపల్లి లో స్థానిక గాంధీజీ ఇంగ్లీష్ మీడియం పాఠశాలలో విద్యార్థులతో కలిసి యోగ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ యోగా చేయడం వలన విద్యార్థులకు విజ్ఞానం పెంపొందిస్తుందని, గుండె పనితీరును మెరుగుపరుస్తుంది. మరియు రక్తపోటును అదుపులో ఉంచుతుంది. క్రమం తప్పకుండా యోగా చేయడం వలన రోగ నిరోధక శక్తి పెరుగుతుంది. శరీరాన్ని దృఢంగా, సరళంగా మారుస్తుంది. బిపి, షుగర్ కడుపు నొప్పి వంటి సమస్యలను అదుపులో ఉంచుతూ, శ్వాసకోశ వ్యవస్థ మెరుగుపడుతుంది. శరీరంలో రోగాలతో పోరాడే శక్తిని పెంపొందిస్తుంది.ఈ కార్యక్రమంలో పాఠశాల డైరెక్టర్ సరికొండ వెంకన్న, కర్నాటి నాగరాజు, ప్రిన్సిపల్ సామల వెంకటేశం, ఉపాధ్యాయుని, ఉపాధ్యాయులు, విద్యార్థినీ, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

# మృతుడు కాటం నరసింహా కుటుంబానికి ఆర్థిక సహాయం



**రామన్నపేట, ఆగస్టు 7 (ప్రజా జ్యోతి):** అనారోగ్యంతో మృతి చెందిన కాటం నరసింహ కుటుంబాన్ని బీఆర్ఎస్ జిల్లా మాజీ ఉపాధ్యక్షులు, టి యు ఎఫ్ మైనార్టీ సెల్ కన్వీనర్, హంస ఫౌండేషన్ జిల్లా ఉపాధ్యక్షులు షేక్ చాంద్ పరామర్శించారు.ఈ సందర్భంగా బాధిత కుటుంబానికి అర క్వింటల్ బియ్యం, రూ. 2500 నగదు సహాయం అందజేశారు. ప్రభుత్వం కుటుంబాన్ని ఆర్థికంగా ఆదుకోవాలని కోరారు.ఈ కార్యక్రమంలో మహమ్మద్ జానీ, మల్లం సైదులు, కాటం రమేష్, కాటం నిర్మల, మమత తదితరులు పాల్గొన్నారు.

## మల్లేపల్లి మండల యాదవ సంఘం నూతన కమిటీ ఏర్పాటు

**- అధ్యక్షుడిగా రావుల సత్యనారాయణ -- ఉపాధ్యక్షులుగా బూడిద శ్రీనివాస్ యాదవ్ సహా ముగ్గురు ఎన్నిక**



**మల్లేపల్లి, ఆగస్టు 07,(ప్రజాజ్యోతి):** మల్లేపల్లి మండలంలో అఖిల భారత యాదవ సంఘం జిల్లా అధ్యక్షులు ముచ్చర్ల ఏడుకొండలు ఆధ్వర్యంలో యాదవ సంఘం మండల నూతన కమిటీని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా మల్లేపల్లి మండల యాదవ సంఘం అధ్యక్షుడిగా రావుల సత్యనారాయణ, ఉపాధ్యక్షులుగా బూడిద శ్రీనివాస్ యాదవ్, మావిళ్ల లింగం, రాంబాబు యాదవ్, ప్రధాన కార్యదర్శిగా కావటి వెంకటేష్, యువజన అధ్యక్షుడిగా బోడ అశోక్ యాదవ్ ను ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ సమావేశంలో జిల్లా ఎన్నికల కోఆర్డినేటర్ సోమనబోయిన సుధాకర్ యాదవ్, జిల్లా ఉపాధ్యక్షులు గుండెబోయిన వెంకటేష్ యాదవ్, గౌరవ అధ్యక్షులు రావుల చిన్న బిక్షం పాల్గొని నూతన కమిటీని ప్రకటించారు. నూతన అధ్యక్షుడు రావుల సత్యనారాయణ మాట్లాడుతూ, తనపై విశ్వాసం ఉంచి మండల అధ్యక్షుడిగా ఎన్నుకున్న ప్రతి ఒక్కరికీ కృతజ్ఞతలు తెలిపారు. యాదవ సంఘం అభివృద్ధి, సంక్షేమం కోసం అందరినీ కలుపుకొని పనిచేస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో నక్క వెంకటేష్ యాదవ్, మేకల శ్రీనివాస్ యాదవ్, అబ్బనబోయిన శ్రీనివాస్ యాదవ్, బూడిద వెంకటేష్ యాదవ్, రావుల వెంకటేశ్వర్లుతో పాటు యాదవ సంఘం నాయకులు, సభ్యులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.ు

## అఖిల భారత యాదవ సంఘం మల్లేపల్లి మండల యువజన అధ్యక్షుడిగా బోడ అశోక్ యాదవ్ ఎన్నిక



**మల్లేపల్లి, ఆగస్టు 07,(ప్రజాజ్యోతి):** అఖిల భారత యాదవ సంఘం మల్లేపల్లి మండల యువజన అధ్యక్షుడిగా బోడ అశోక్ యాదవ్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా తన నియామకంపై హర్షం వ్యక్తం చేసిన ఆయన, తనపై నమ్మకం ఉంచి ఈ బాధ్యతలు అప్పగించిన సంఘం జిల్లా, మండల నాయకత్వానికి హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు. యాదవ సంఘాన్ని మరింత బలోపేతం చేయడంతో పాటు యువతను సంఘటితం చేసి, సమాజ అభివృద్ధికి అంకితభావంతో పనిచేస్తానని బోడ అశోక్ యాదవ్ పేర్కొన్నారు. యాదవుల ఐక్యత, హక్కుల పరిరక్షణ, సంక్షేమం కోసం నిరంతరం కృషి చేస్తానని తెలిపారు. ఈ బాధ్యతలను సమర్థవంతంగా నిర్వహిస్తూ సంఘం ఆశయాలకు అనుగుణంగా ముందుకు సాగుతానని చెప్పారు. తన నియామకానికి సహకరించిన అఖిల భారత యాదవ సంఘం జిల్లా అధ్యక్షులు ముచ్చర్ల ఏడుకొండలు, జిల్లా నాయకులు, మండల కమిటీ సభ్యులు, పెద్దలు, శ్రేయోభిలాషులు మరియు యాదవ సంఘం సభ్యులందరికీ ఆయన ప్రత్యేకంగా ధన్యవాదాలు తెలిపారు.


## సిరిపురంలో ప్రపంచ తల్లిపాల వారోత్సవాలు



**రామన్నపేట,ఆగస్టు7 (ప్రజా జ్యోతి ):** ప్రపంచ తల్లిపాల వారోత్సవాలు 2026 లో భాగంగా ఈరోజు సిరిపురం అంగన్వాడీ కేంద్రాలలోఅన్నప్రాసన సి బి ఈ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా బిడ్డ పుట్టిన వెంటనే ముర్రుపాలు, 6 నెలల వరకు కేవలం తల్లిపాలు, 2 సంవత్సరాల వరకు తల్లిపాలతో పాటు అనుబంధ ఆహారం ఇవ్వాలని తల్లులకు అవగాహన కల్పించారు. ముర్రుపాలు బిడ్డకు వ్యాధి నిరోధక శక్తిని ఇస్తాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ అంబటి ఉపేంద్ర రవీందర్ రెడ్డి, ఉపసర్పంచ్ మూడుదూడ్ల అనూష రమేష్, పంచాయితీ సెక్రటరీ, జ్యోతి, వార్డు సభ్యులు, ఏఎన్ఎం శ్యామల, అంగన్వాడీ టీచర్లు వసంత, జ్యోతి, సునీత, నవనీత, ఆశాలు, మహిళా సంఘ సభ్యులు, గర్భిణీలు, బాలింతలు పాల్గొన్నారు.

## న్యూ జనరేషన్ స్కూల్‌లో తెలంగాణ సంస్కృతి వెల్లివిరిసింది





**గరిడేపల్లి,ఆగస్టు 07(ప్రజా జ్యోతి):** తెలంగాణ సంస్కృతి,సంప్రదా యాలకు ప్రతీక అయిన బోనాల పండుగను గరిడేపల్లి న్యూ జనరేషన్ స్కూల్‌లో శుక్రవారం కనులపండువగా నిర్వహించారు సాంప్రదాయ దుస్తుల్లో విద్యార్థు లు ఉపాధ్యాయులు పాల్గొనగా విద్యార్థినులు నెత్తిపై బోనాలు, తోట్టెలతో దుర్గామాత నామస్మ రణ చేస్తూ నిర్వహించిన ఊరేగిం పు ఆకట్టుకుంది. పోతు రాజుల విన్యాసాలు, శివసత్తుల నృత్యా లు, దప్పుల దరువులతో పాఠశాల ఆవరణ ఆధ్యాత్మిక శోభను సంతరించుకుంది. ఈ సందర్భంగా పాఠశాల ప్రిన్సిపాల్ అవుల నరసింహారావు మాట్లాడుతూ విద్యార్థులకు విద్యతో పాటు తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలు, పండుగల గొప్పతనాన్ని పరిచయం చేయడమే ఈ వేడుకల ప్రధాన ఉద్దేశమని తెలిపారు. ఇటువంటి ఉత్సవాలు పిల్లల్లో ఆధ్యాత్మికత, సంస్కృతి పట్ల గౌరవం మరియు సంప్రదా యాలపై అవగాహన పెంపొందిస్తాయని పేర్కొన్నారు. అనంతరం విద్యార్థులకు ప్రసాదాన్ని పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, సిబ్బంది, విద్యార్థుల తల్లిదండ్రు లు పాల్గొని వేడుకను విజయవంతం చేశారు.

## గొర్రెల కాపరుల హక్కులు హరిస్తే సహించం

**- గొర్రెల మేకల పెంపకం దారుల సంఘం జిల్లా గౌరవ అధ్యక్షులు బండారు నరసింహా**



**భూదాన్ పోచంపల్లి, ఆగస్టు 07 (ప్రజాజ్యోతి):** గొర్రెలు, మేకల పెంపకం దారులకు ప్రభుత్వ భూములు కేటాయించాలని తెలంగాణ గొర్రెల మేకల పెంపకం దారుల సంఘం యాదాద్రి భువనగిరి జిల్లా గౌరవ అధ్యక్షులు బండారు నరసింహ డిమాండ్ చేశారు. పోచంపల్లి వృత్తిదారుల భవనంలో సంఘం మండల అధ్యక్షులు నారి మల్లేశం అధ్యక్షతన ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా బండారు నరసింహ మాట్లాడుతూ.. పోచంపల్లి పరిధిలోని ప్రభుత్వ బంజరాయి, పోరంబోకు భూముల్లో గొర్రెల కాపరులు గత 70 ఏళ్లుగా మందలను మేపుకుంటూ, మందల దొడ్లను ఏర్పాటు చేసుకుని జీవిస్తున్నారని తెలిపారు. జీవో 1016, 559 ప్రకారం అర్హులైన పెంపకం దారులకు భూములు కేటాయించాలని కోరారు. సమస్య పరిష్కరించకపోతే పెద్ద ఎత్తున ఆందోళన చేపడతామని హెచ్చరించారు. సంఘం 30 ఏళ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా ఈ నెల 22, 23, 24 తేదీల్లో హైదరాబాద్ చెంగిచెర్లలో రాష్ట్ర మహాసభలు నిర్వహించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో సంఘం నాయకులు బుగ్గ లక్ష్మయ్య, గుణముని ఐలయ్య, రావుల జంగయ్య, బాతుక లింగస్వామి, తంగేళ్ల దశరథ్ తదితరులు పాల్గొన్నారు.

## సీపీఐ ప్రచార జాతాను జయప్రదం చేయండి

- **కేంద్ర ప్రభుత్వ వ్యతిరేక విధానాలపై 'కమ్యూనిస్టు'ల పోరు**
- **ఈ నెల 9న చౌటుప్పల్‌కు జాతా: జిల్లా కార్యవర్గ సభ్యుడు పల్లె శేఖర్‌రెడ్డి**
- **అధిక సంఖ్యలో తరలిరావాలని పిలుపు**



**చౌటుప్పల్, ఆగస్టు 7 ( ప్రజా జ్యోతి ):** కేంద్రంలోని భాజపా ప్రభుత్వం అమలు చేస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలకు నిరసనగా ఈ నెల 6 నుంచి 14 వరకు నిర్వహిస్తున్న సీపీఐ ప్రచార జాతాను విజయవంతం చేయాలని ఆ పార్టీ జిల్లా కార్యవర్గ సభ్యుడు పల్లె శేఖర్‌రెడ్డి కోరారు. శుక్రవారం చౌటుప్పల్ మండల కేంద్రంలోని సీపీఐ కార్యాలయంలో మండల కౌన్సిల్ సమావేశం నిర్వహించారు. సమావేశానికి ముఖ్యఅతిథిగా హాజరైన పల్లె శేఖర్‌రెడ్డి మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వ పాలనలో నిరుద్యోగం విపరీతంగా పెరిగిపోయిందని, నిత్యావసర వస్తువుల ధరలు ఆకాశాన్నంటుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రభుత్వ రంగ సంస్థల ప్రైవేటీకరణ సహా అనేక అంశాలపై మోదీ ప్రభుత్వం అవలంబిస్తున్న విధానాలను నిరసిస్తూ ప్రజలకు అవగాహన కల్పించేందుకు మునుగోడు నియోజకవర్గ వ్యాప్తంగా జాతా కొనసాగుతోందన్నారు. ఈ నెల 9వ తేదీ ఆదివారం ప్రచార జాతా చౌటుప్పల్ పట్టణానికి రానున్న నేపథ్యంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు, ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సీపీఐ పురపాలక కార్యదర్శి పగిళ్ల మోహన్ రెడ్డి, సహాయ కార్యదర్శి ఉడత రామలింగం, బద్దుల సుధాకర్, బోయిన యాదయ్య, టంగుటూరి రాములు, రోషనగారి అంజయ్య, కుంటి పాపయ్య, సింగపంగ బుచ్చయ్య, నీల బిక్షపతి తదితరులు పాల్గొన్నారు.

# ప్రపంచవ్యాప్తంగా కమ్యూనిస్టులకు పెరుగుతున్న ఆదరణ

**- దేశ సంపద కార్పోరేట్ శక్తులకు ధారా దత్తం చేస్తున్న మోడీ**

**-నియోజకవర్గ స్థాయి సమావేశంలో మాజీ ఎమ్మెల్యే జూలకంటి**

**మిర్యాలగూడ,ఆగస్టు 07,( ప్రజాజ్యోతి ):** ప్రపంచవ్యాప్తంగా కమ్యూనిస్టుల ప్రాబల్యంపెరుగుతుందని అమెరికా అధ్యక్షుడు ట్రంప్ ఇటీవల చేసిన వ్యాఖ్యలే అందుకు నిదర్శనమని సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు, మాజీ ఎమ్మెల్యే జూలకంటి రంగారెడ్డి అన్నారు . శుక్రవారం స్థానిక సిపిఎం కార్యాలయంలో మిర్యాలగూడ నియోజకవర్గ జనరల్ బాడీ సమావేశం రాష్ట్ర కమిటీ సభ్యుడు మల్లేష్ అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా రంగారెడ్డి మాట్లాడుతూ ప్రపంచ నియంతగా ఉన్న అమెరికా అధ్యక్షుడు ట్రంప్ ఇటీవల కమ్యూనిస్టుల ప్రాబల్యంపెరుగుతుందని చేసిన వ్యాఖ్యలు కమ్యూనిస్టుల పట్ల ఆయనభయపడుతున్న వైఖరిస్పష్టమవుతుందని తెలిపారు. ప్రపంచం లోని చైనా,క్యూబా, వెనిజులా తదితర కమ్యూనిస్టు దేశాల్లో వస్తున్న పరిణామాలు కమ్యూనిజంకనుమరుగవుతుందని అన్న వారికి కనువిప్పు కలిగించే విధంగా ఉందని వారు వివరించారు. అంతర్జాతీయంగా కమ్యూనిజం అజేయమన్న సంగతి జరుగుతున్న మార్పుల వల్ల స్పష్టమవుతుందని వారు తెలిపారు. కేంద్రం లో అధికారంలో ఉన్న మోడీ ప్రభుత్వం ప్రజా వ్యతిరేక విధానాలతో పాటు రైతు విద్యార్థి మధ్యతరగతి వర్గాలను ఇబ్బందుల పాలు చేసే విధానాలకు పాల్పడు తుందన్నారు. దేశ సంపదను కొల్లగొట్టి పెట్టుబడిదారులకు దాసోహం అనే విధంగా మోడీ ప్రభుత్వం గత 12 సంవత్సరాలుగా కొనసాగుతుందని దీనికి చరమగీతం పాడాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. ఇటీవల నీట్ పరీక్షల్లో జరిగిన అవకతవకలపై విద్యార్థులు చేసిన పోరాటాలకు కేంద్రం తన ఓటమిని అంగీకరించే విధంగా మంత్రిని రాజీనామా చేయించిందని వారు తెలిపారు.మతం పేరుతో పాలకుల అనుసరిస్తున్న విధానాలపై ప్రజలు సంఘటితం కావలసిన పరిస్థితిఏర్పడుతున్నాయని బలమైన ఉద్యమాలు నడపాలని అందుకు త్యాగాలు అవసరమని ఆయన సూచించారు. సర్ పేరుతో కేంద్రం ఓట్లు తగ్గించాలనిచూస్తుందని దీన్ని వ్యతిరేకించాలని కోరారు. రాష్ట్రంలో ఎన్నికల సందర్భంగా కాంగ్రెస్ పార్టీ ఆరు పథకాలు అమలు చేస్తామని అధికారాన్ని దక్కించుకొనిఅధికారంలోకి రాగానే వాటిలో కొన్నింటిని మాత్రమే అమలు చేయటం బాధాకరమన్నారు. రాష్ట్రంలో పెండింగ్ ప్రాజెక్టులను కాంగ్రెస్ ప్రభుత్వంపట్టించుకోకుండా ఆపార్టీలోని కుమ్ములాటలతో కాలం




గడుపుతుందని విమర్శించారు.నవంబర్ మాసంలో జరిగే రైతు సంఘం జాతీయ మహాసభలకునిధులను సేకరించాలని ప్రతి రైతుని కలవాలని బహిరంగ సభకు ఇంటికో మనిషి ఊరుకో బస్సు లో తరలిరావా లని ఆయన కోరారు.10వ తేదీన జరిగే జైల్ భరో కార్యక్రమం విజయవంతం చేయాలి :- జిల్లా కార్యదర్శి వీరారెడ్డి.ఈనెల 10వ తేదీన దేశవ్యాప్తంగా జరుప తలపెట్టిన జైల్ భరో కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని సిపిఎం జిల్లా కార్యదర్శి తుమ్మల వీరారెడ్డి కోరారు .ఈ సమావేశంలో పాల్గొని మాట్లాడుతూ నాడు దేశానికి స్వాతంత్రం కావాలని జరిగిన క్విట్ ఇండియా ఉద్యమ స్ఫూర్తితో జైల్ భరో కార్యక్రమాన్ని చేపట్టడం జరిగిందని ఇది అత్యంత ప్రాధాన్యమైన పోరాటమని తెలిపారు. నేటి పాలకులు బహుళ జాతి కంపెనీలకు ఊడిగం చేస్తున్నారని దాన్ని నిరసిస్తూనే దేశాన్ని రక్షించుకోవాలని ఉద్దేశంతో జైల్ భరో కార్యక్రమాము జరగనుందని వారు తెలిపారు. దేశంలో నాలుగు లేబర్ కోడ్ల వల్ల రైతులు కార్మికులు ఇబ్బందులు పడుతున్నారని రైతులకు కనీస మద్దతు ధర ఇచ్చే పరిస్థితులు లేవని వారు తెలిపారు. దీంతోపాటు విద్యుత్ సంస్కరణ చట్టాన్ని తీసుకొని వచ్చి ఉచిత కరెంటుకు తిలోదకాలు ఇవ్వాలని చేస్తున్న ప్రయత్నాలను తిప్పికొట్టాలని అన్నారు. సమావేశంలో జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు వీరేపల్లి వెంకటేశ్వర్లు,జిల్లా కమిటీ సభ్యులు రాగిరెడ్డి మంగారెడ్డి, రవి నాయక్,వినోద్ నాయక్,శశిధర్ రెడ్డి, వరలక్ష్మి, పట్టణ కార్యదర్శులు మల్లు గౌతమ్ రెడ్డి,భావండ్ల పాండు,గిరిజన సంఘం నాయకులు ఎర్రనాయక్ , సైదులు అరుణ,నాగమణి, గోవర్ధన,సైదమ్మ తదితరులు పాల్గొన్నారు.

# కేంద్ర ప్రభుత్వం నాలుగు లేబర్ కోడ్లను రద్దు చేయాలి

**- సిఐటియు జిల్లా కమిటీ సభ్యుడు రణపంగకృష్ణ**



**పెన్ పహాడ్ ఆగస్టు 7 (ప్రజాజ్యోతి):** కేంద్ర ప్రభుత్వం నాలుగు లేబర్ కోడ్లను రద్దు చేయాలని ఎంపీడీవో జానయ్య కు శుక్రవారం వినతి పత్రం అందజేశారు. గ్రామపంచాయతీ కార్మికులు సిఐటియు ఆధ్వర్యంలో ఈనెల పదవ తారీకున జరిగే క్విట్ ఇండియా ఉద్యమ స్ఫూర్తితో ఆలిండియా సిఐటియు పిలుపు మేరకు ఆగస్టు పదవ తారీకున జరిగే కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని సిఐటియు జిల్లా కమిటీ సభ్యుడు రణపంగ కృష్ణ. ఆ సంఘం జిల్లా అధ్యక్షులు ధనియాకుల శ్రీనివాస్. మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వ తీసుకొచ్చిన నాలుగు లేబర్ కోడ్లను రద్దు చేయాలని కనీస వేతనం ఇరవైఆరు వేల రూపాయలు ఇవ్వాలని మల్టీపర్పస్ విధానం రద్దు చేయాలని జిపి కార్మికులని ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని ప్రభుత్వ ఉద్యోగుల మాదిరిగా పిఆర్సి కలపా లని అర్హులైన జిపి కార్మికులని కారోబార్లుగా నియమించాలని సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పు ప్రకారం కనీస వేతనం 26,000 ఇచ్చి జిపి కార్మికులను సమాజంలో ఓ సంఘ కర్తలుగా గుర్తించాలని పెండింగ్ వేతనాలు వెంటనే చెల్లించాలి కేంద్రంలో అధికారులు ఉన్న బిజెపి ప్రభుత్వం తమ ఇష్టం వచ్చిన పద్ధతులలో చట్టాలను చేసి నెలకు పదివేల వేతనం ఇచ్చి14 గంటలు పని చేస్తున్నారని అందుకే కిట్ ఇండియా ఉద్యమస్ఫూర్తితో అన్ని రంగాల కార్మికులందరూ జైల్ బరో కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని కార్మికులను కోరారు.ఈ కార్యక్రమంలో జిపి కార్మిక సంఘం కార్యదర్శి దూదియా, ఎల్లమ్మ,రమణ,రోజా, సత్తమ్మ. మహేష్. తదితరులు పాల్గొన్నారు.

## తాళం వేసిన ఇంట్లో భారీ చోరీ.. 5 లక్షలపైగా నగదు మాయం



**భూదాన్ పోచంపల్లి, ఆగస్టు 07 (ప్రజాజ్యోతి):** పట్టణంలోని వెంకటరమణ కాలనీలో పట్టపగలే ఇంట్లో చోరీ జరగడం కలకలం రేపింది. కాలనీకి చెందిన వ్యాపారి బోడ్ రమేష్ తన భార్యతో కలిసి శుక్రవారం ఉదయం 7.30 గంటల సమయంలో ఇంటికి తాళం వేసి భువనగిరి చౌరస్తాలోని తన కిరాణా దుకాణానికి వెళ్లాడు. సాయంత్రం మంచినీరు పడుదమని ఇంటికి తిరిగి వచ్చేసరికి ఇంటి తాళం తెరిచి ఉండటాన్ని గమనించిన రమేష్ అనుమానంతో లోపలికి వెళ్లి చూడగా బీరువాలు పగులగొట్టి కనిపించాయి. కిరాణా సామాను కొనుగోలు చేసేందుకు సిద్ధంగా ఉంచిన రూ.5 లక్షలకు పైగా నగదు కనిపించకపోవడంతో దుండగులు చోరీకి పాల్పడినట్లు గుర్తించాడు. వెంటనే పోలీసులకు సమాచారం అందించడంతో పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని పంచనామా నిర్వహించారు. చోరీకి పాల్పడిన వారిని గుర్తించే పనిలో పోలీసులు నిమగ్నమయ్యారు. ఈ ఘటనతో వెంకటరమణ కాలనీతో పాటు పట్టణ వ్యాప్తంగా భయాందోళన నెలకొంది.

## చెత్తబుట్టల వినియోగంపై అవగాహన



**రామన్నపేట, ఆగస్టు 7 (ప్రజా జ్యోతి):** రామన్నపేట మండలం, బోగారం గ్రామంలో గ్రామాన్ని పరిశుభ్రంగా ఉంచేందుకు నాలుగు రకాల చెత్తబుట్టల వినియోగంపై అవగాహన కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమాన్ని సర్పంచ్ కూనూరు సాయికుమార్ గౌడ్ ప్రారంభించి, చెత్తను వేరు చేసి సరైన బుట్టలో వేయాలని ప్రజలకు సూచించారు.కార్యక్రమంలో ఉపసర్పంచ్ బైకాని ఉమా, వార్డు సభ్యులు నేరటి మానస, మేడి ఆంజనేయులు, కనుక మల్లేష్, చిరగోని శిల్పా, నవీన్ యాదవ్, వనం అండాలు, పంచాయతీ కార్యదర్శి ఏ. సుధా సంఘబంధం అధ్యక్షురాలు పబ్బు జ్యోతి మరియు గ్రామస్తులు పాల్గొన్నారు.

## ఆగస్టు 15నాటికి యూనిఫామ్స్ సిద్ధం చేయాలి

**- కమిషనర్ శ్రీజ**



**మిర్యాలగూడ,ఆగస్టు 07,( ప్రజాజ్యోతి):** విద్యార్థులకు అందించేందుకు ఆగస్టు 15 నాటికి యూనిఫార్మ్స్ రెడీ చేయాలని మిర్యాలగూడ మున్సిపల్ కమిషనర్ నర్రా శ్రీజరెడ్డి కోరారు. మిర్యాలగూడ పట్టణంలోని ప్రభుత్వ పాఠశాలలకు స్వయం సహాయక సంఘాల ఆధ్వర్యంలో చేపట్టిన విద్యార్థుల ఏక రూప దుస్తుల తయారీని ఆమె శుక్రవారం పరిశీలించారు.సుమారు 10వేల మందివిద్యార్థిని విద్యార్థులకు ఏక రూప దుస్తుల తయారికి పట్టణ దారిద్ర్య నిర్మూలన కార్యక్రమం (మెప్మా )క్రింద స్వయం సహాయక మహిళా సంఘాలకు దుస్తుల తయారీ పనులు ఇస్తున్నారు. ఆగష్టు 15న, విద్యార్థులకు పంపిణీ చేసేలా దుస్తుల తయారు పూర్తి చేయాలని ఆమె ఆదేశించారు. ఆమె వెంట మెప్మా టిఎంసి పి.బక్కయ్య ఉన్నారు.

# పగటి పూట చోరీలకు పాల్పడిన అంతర్రాష్ట్ర ప్రధాన నిందితుడు అరెస్ట్

**-రూ.3.25 లక్షల నగదు, స్కూటీ, స్వాధీనం-మరో ఇద్దరి నిందితుల కోసం గాలింపు**

**-పోలీసు అధికారులను, సిబ్బందిని అభినందించిన-జిల్లా ఎస్పీ శరత్ చంద్ర పవర్**




**నల్గొండ ఆగస్టు 7,(ప్రజా జ్యోతి ):** నల్లగొండ పట్టణంలో ఇటీవల వరుసగా జరిగిన పగటి పూట ఇంటి చోరీల కేసులను పోలీసులు ఛేదించారు. నల్లగొండ వన్‌టౌన్, టూ టౌన్ పోలీసుల సంయుక్త దర్యాప్తులో అంతర్రాష్ట్ర చోరీల ముఠాకు చెందిన ప్రధాన నిందితుడు మహమ్మద్ నసీమ్ (48)ను అరెస్టు చేసి, అతని వద్ద నుంచి రూ.3.25 లక్షల నగదు, ఒక స్కూటీ, రెండు ఇనుప రాడ్లు, మాస్క్, సెల్‌ఫోన్‌ను స్వాధీనం చేసుకున్నట్లు అదనపు ఎస్పీ జి. రమేష్ తెలిపారు.జూలై 26న నల్లగొండలోని వి.టి. కాలనీలో అపార్ట్‌మెంట్ ఫ్లాట్‌లో జరిగిన చోరీతో పాటు వన్‌టౌన్ పరిధిలో రెండు ఇళ్లలో జరిగిన చోరీలు కూడా ఇదే ముఠా చేసినట్లు దర్యాప్తులో తేలింది. అలాగే ఆంధ్రప్రదేశ్‌లోని నెల్లూరు, తిరుపతి జిల్లాల్లో నమోదైన పలు చోరీ కేసుల్లోనూ ఈ ముఠా ప్రమేయం ఉన్నట్లు పోలీసులు గుర్తించారు.ఇంటి యజమానులు లేని సమయాన్ని గమనించి, తాళాలు పగులగొట్టి బంగారు ఆభరణాలు, నగదు అపహరించడం ఈ ముఠా ప్రధాన నేరపద్ధతిగా పోలీసులు వెల్లడించారు. ఈ కేసులో పరారీలో ఉన్న ఇర్షాద్, షరీఫ్‌ల కోసం ప్రత్యేక పోలీసు బృందాలు రాష్ట్రాల మధ్య సమన్వయంతో గాలింపు కొనసాగిస్తున్నాయని తెలిపారు.ఈ కేసును డీఎస్పీ శివరాం రెడ్డి పర్యవేక్షణలో వన్‌టౌన్ సీఐ రాజశేఖర్ రెడ్డి, టూ టౌన్ సీఐ ఆది రెడ్డి ఆధ్వర్యంలో దర్యాప్తు చేసి కేసును ఛేదించిన పోలీసు అధికారులను, సిబ్బందిని జిల్లా ఎస్పీ శరత్ చంద్ర పవార్ అభినందించారు.

# మోడ్రన్ కబడ్డీ అసోసియేషన్ నూతన కమిటీ ఎన్నిక



**గరిడేపల్లి,ఆగస్టు 07(ప్రజా జ్యోతి):** సూర్యాపేట జిల్లా మోడ్రన్ కబడ్డీ అసోసియేషన్ విస్తరణలో భాగంగా గరిడేపల్లి మండల నూతన కమిటీని శుక్రవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. మండల అధ్యక్షుడిగా చాగంటి వీరయ్య,ప్రధాన కార్యదర్శిగా చాటల సైదులు,కోశాధికారిగా సోమపొంగు లెనిన్,గౌరవ అధ్యక్షుడిగా నందిపాటి సైదులు ఎన్నికయ్యారు.ఉపాధ్యక్షులుగా చామకూరి గురుస్వామి,బి. సత్యనారాయణ రెడ్డి,సహాయ కార్యదర్శులుగా మామిడి హుస్సేన్ సంధ్యల బక్కయ్య లను ఎంపిక చేశారు. ఎగ్జిక్యూటివ్ బాడీ సభ్యులుగా నరసింహ,షేక్ జానీ,పంగా వీరస్వామిలను నియమించారు. ఈ సందర్భంగా సూర్యాపేట జిల్లా మోడ్రన్ కబడ్డీ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి మొర్రాల నాగిరెడ్డి మాట్లాడుతూ, గ్రామీణ ప్రాంతాల్లో దాగి ఉన్న ప్రతిభావంతులైన క్రీడాకారులను వెలికితీయడమే అసోసియేషన్ ప్రధాన లక్ష్యమని తెలిపారు. ఇందుకోసం మండల కేంద్రాల్లో మెగా మోడ్రన్ కబడ్డీ టోర్నమెంట్లు నిర్వహించి, మండల స్థాయి నుంచి జాతీయ, అంతర్జాతీయ స్థాయి వరకు క్రీడాకారులను తీర్చిదిద్దేందుకు కృషి చేస్తామని చెప్పారు.ఈ కార్యక్రమంలో పెండెం అజిత్, కానుగు సైదులు, నందిపాటి వృద్ధి తదితరులు పాల్గొన్నారు.

# ఎడమ కాలువకు నీళ్లు వదిలి రైతులను ఆదుకోవాలి

**- చెరువులు నింపితేనే భూగర్భ జలాలు పెరుగుతాయి**

**- నాగార్జునసాగర్ ఆయకట్టు పరిరక్షణ సమితి వ్యవస్థాపక సభ్యులు సప్పిడి శంబిరెడ్డి**



**గరిడేపల్లి,ఆగస్టు 07 (ప్రజా జ్యోతి):** వర్షాభావ పరిస్థితులతో నాగార్జునసాగర్ ఎడమ కాలువ పరిధిలోని రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నందున ప్రభుత్వం వెంటనే సాగర్ ఎడమ కాలువకు నీటిని విడుదల చేసి చెరువులు, కుంటలను నింపాలని నాగార్జునసాగర్ ఆయకట్టు పరిరక్షణ సమితి వ్యవస్థాపక సభ్యులు సప్పిడి శంబిరెడ్డి ప్రభుత్వాన్ని కోరారు.శుక్రవారం గరిడేపల్లిలో విలేకరులతో మాట్లాడుతూ ఈ ఏడాది ఆశించిన స్థాయిలో వర్షాలు కురవకపోవడంతో భూగర్భ జలాలు అడుగంటిపోయాయని, బోర్లు, బావులు ఎండిపోవడంతో రైతులు,గ్రామీణ ప్రజలు తీవ్ర నీటి కొరతను ఎదుర్కొంటున్నారని తెలిపారు.నాగార్జునసాగర్ కుడికాలువ ద్వారా ఇతర ప్రాజెక్టులకు నీటిని విడుదల చేసి అక్కడి రైతులను ఆదుకోవడం స్వాగతించదగ్గ విషయమేనని, అదే విధంగా ఎడమ కాలువ పరిధిలోని తెలంగాణ రైతుల సమస్యలను కూడా ప్రభుత్వం సమానంగా పరిగణించాలని కోరారు. ఎడమ కాలువ కింద లక్షల ఎకరాల ఆయకట్టు ఉండగా నీటి విడుదల లేక రైతులు తీవ్ర ఆందోళనలో ఉన్నారని పేర్కొన్నారు.అనేక ప్రాంతాల్లో వరి నాట్లు ఆలస్యమయ్యాయని,నాటిన పంటలు కూడా నీటి కొరతతో ఎండిపోయే పరిస్థితి నెలకొందన్నారు.అప్పులు చేసి వ్యవసాయం ప్రారంభించిన రైతులకు సాగునీరు అందక పెట్టుబడులు వృథా అయ్యే ప్రమాదం ఉందని ఆవేదన వ్యక్తం చేశారు.సాగర్ ఎడమ కాలువకు వెంటనే విడతల వారీగా నీటిని విడుదల చేసి మార్గమధ్యంలోని చెరువులు, కుంటల ను నింపితే భూగర్భ జలాలు పెరగడం తో పాటు తాగునీటి సమస్య కూడా కొంతవరకు పరిష్కారమవుతుందని తెలిపారు.దీంతో పశువులకు నీటి కొరత తీరడమే కాకుండా రైతులు తమ పంటలను కాపాడుకునే అవకాశం ఉంటుందని అన్నారు.రైతు సమస్యలపై రాజకీయాలకుఅతీతంగాప్రభుత్వం,అధికారులు,ప్రజాప్రతినిధులు స్పందించి అత్యవసర చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. రైతుల దుస్థితిని దృష్టిలో ఉంచుకుని నాగార్జునసాగర్ నుంచి వెంటనే నీటి విడుదలపై స్పష్టమైన నిర్ణయం తీసుకోవాలని, ఆలస్యం చేస్తే రైతాంగంలో అసంతృప్తి మరింత పెరిగే అవకాశం ఉందని హెచ్చరించారు.

# వ్యసనాలకు బానిసై దేవాలయాల్లో చోరీలు




**హాలియా,ఆగస్టు7(ప్రజా జ్యోతి):** వ్యసనాలకు బానిసగా మారి దేవాలయాల్లో చోరీకి పాల్పడుతున్న పాత నేరస్తుడిని హాలియా పోలీసులు చాకచక్యంగా పట్టుకుని శుక్రవారం అరెస్ట్ చేశారు. హాలియా ఎస్ఐ బండి.సాయి ప్రశాంత్ తెలిపిన వివరాల ప్రకారం నల్లగొండ జిల్లా దేవరకొండ పట్టణానికి చెందిన గంజి వెంకటేష్ (33) అనే నిందితుడు గత కొంతకాలంగా మద్యానికి బానిసగా మారి ఖర్చులకోసం డబ్బులు లేకపోవడంతో దేవాలయాలను టార్గెట్ గా చేసుకుని దొంగతనాలకు పాల్పడుతున్నట్లు పోలీసుల విచారణలో పేర్కొన్నారు. నిందితుడు గత నాలుగవ తేదీ రాత్రి సమయంలో హాలియా పట్టణంలోని పార్వతి జడల రామలింగేశ్వర స్వామి ఆలయంలోని హుండీని ఎత్తుకెళ్లినట్లు పోలీసులు తెలిపారు. గత మూడు రోజులుగా పోలీసులు సీసీ ఫుటేజీ ఆధారల సహాయంతో దర్యాప్తు కొనసాగిస్తుండగా శుక్రవారం అనుముల గ్రామ పరిధిలోని ద్వారకాపురి వద్ద పోలీసులు చేపట్టిన వాహన తనిఖీల్లో అనుమానస్పదంగా సంచరిస్తున్న నిందితుడు పట్టుబడ్డాడు.అతని నుండి రూ.1000 లు స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. నిందితుడు వెంకటేష్ పై గతంలో దేవరకొండ టౌన్,నల్లగొండ1 టౌన్ ,నల్లగొండ11 టూ టౌన్ విజయపురి టౌన్ పోలీస్ స్టేషన్ లలో కేసులు ఉన్నట్లు పేర్కొన్నారు.నిందితుడిని కోర్టులో హాజరు పరచగా జడ్జి అతనిని జ్యుడీషియల్ రిమాండ్ విధించారు.కేసును అత్యంత వేగంగా చేదించిన పోలీస్ కానిస్టేబుల్ కొప్పుల వెంకన్న, ఎజాజ్ లను సీఐ రాఘవరావు, ఎస్ఐ సాయి ప్రశాంత్ లు అభినందించారు..

# సాంకేతిక ప్రమాణాల ప్రకారమే మరమ్మత్తులు

**- నాణ్యతలో ఎలాంటి లోపాలు లేవు - సాంకేతిక నిపుణుల బృందం**



**చింతలపాలెం, మేళ్ళచెరువు ఆగస్టు 7 (ప్రజా జ్యోతి):** మహాత్మా గాంధీ లిఫ్ట్ ఇరిగేషన్ పథకంలో పైకి తేలిన పైపుల మరమ్మత్తులు పూర్తిగా సాంకేతిక ప్రమాణాలకు అనుగుణంగా చేపట్టి, నాణ్యతలో ఎలాంటి లోపాలు లేకుండా చూస్తామని సాంకేతిక నిపుణుల బృందం స్పష్టం చేసింది. ప్రజా జ్యోతి తో పాటు పలు పత్రికల్లో ప్రచురితమైన కథనాల నేపథ్యంలో ఇరిగేషన్ శాఖ అధికారులు శుక్రవారం సాంకేతిక నిపుణుల బృందంతో కలిసి పైకి తేలిన పైపులను పరిశీలించారు. నేల స్వభావం, వరదల ప్రభావం కారణంగానే పైపులు పైకి కదిలాయని అధికారులు తెలిపారు. పరిశీలనలో సుమారు 80 మీటర్ల మేర 14 పైపులు కదిలినట్లు గుర్తించి, వాటిని వెలికితీసినట్లు వెల్లడించారు. ఈ ప్రాంతంలో కాంక్రీట్ బెడ్ ఏర్పాటు చేయడంతో పాటు పైపుల చుట్టూ అర మీటరు మందంతో కాంక్రీట్ రక్షణ కల్పించాలని కమిటీ సూచించింది. అలాగే పైపుల్లో నీటిని నింపి అవసరమైన సాంకేతిక పరీక్షలు నిర్వహించిన అనంతరమే మట్టితో పూడ్చాలని నిర్ణయించింది. ప్రభావిత ప్రాంతం 80 మీటర్లు మాత్రమే అయినప్పటికీ, భద్రతను దృష్టిలో ఉంచుకుని 200 మీటర్ల మేర కాంక్రీట్ బెడ్ ఏర్పాటు చేయాలని సూచించినట్లు అధికారులు తెలిపారు. అదే విధంగా పైప్‌లైన్‌లోకి చేరిన మట్టి, బురదను పూర్తిగా తొలగించి, సాంకేతిక ప్రమాణాలకు అనుగుణంగా అన్ని నాణ్యతా పరీక్షలు నిర్వహించి ఎలాంటి లోపాలు లేకుండా చర్యలు తీసుకుంటామని తెలిపారు పైపులు పరచే పనుల సమయంలో ఇలాంటి పరిస్థితులు సహజమేనని, ప్రజలు, రైతులు ఎలాంటి ఆందోళన చెందాల్సిన అవసరం లేదని అన్నారు. ఇప్పటికే మరమ్మత్తు పనులు ప్రారంభించామని, వారం రోజుల్లో పూర్తిచేసి పైపుల భద్రతను మరింత బలోపేతం చేస్తామని తెలిపారు. ఈ పరిశీలనలో ఇరిగేషన్ సెంట్రల్ డిజైన్ ఆర్గనైజేషన్ ఎస్ఈ జహీర్, సీఈ నాగభూషణ్ రావు, ఈఈ సత్యనారాయణ, ఏఈలు ప్రసన్న, సరిత పాల్గొన్నారు.

# కరివిరాలలో బీసీ బాలుర వసతి గృహస్థల పరిశీలన

**-జెడ్పీహెచ్ఎస్ ఆవరణ, మౌలిక వసతుల తనిఖీ-కొత్త హాస్టల్ ఏర్పాటుకు పూర్తి సహకారం.సర్పంచ్**

**నడిగూడెం, ఆగస్టు7, ప్రజా జ్యోతి:** కరివిరాల జెడ్పీహెచ్ఎస్ ఆవరణలో ప్రతిపాదిత బీసీ బాలుర వసతి గృహం స్థలాన్ని జిల్లా బీసీ సంక్షేమ అభివృద్ధి శాఖ అధికారి విశాల్ ధర్, కోదాడ డివిజనల్ బీసీ వెల్ఫేర్ అధికారి కె. వంశీ, మండల అధికారులు పరిశీలించారు. ఈ సందర్భంగా పాఠశాల భవనాలు, తాగునీరు, ఇతర మౌలిక వసతులను తనిఖీ చేసి, విద్యార్థుల సౌకర్యార్థం ప్రహరీ గోడ నిర్మాణంతో పాటు అవసరమైన ఏర్పాట్లు చేయాలని సూచించారు.



కొత్త బీసీ బాలుర వసతి గృహం ఏర్పాటుకు గ్రామ పంచాయతీ తరఫున పూర్తి సహకారం అందిస్తామని సర్పంచ్ మరోజు పార్వతమ్మ వెంకటాచారి తెలిపారు. కార్యక్రమంలో ఉప సర్పంచ్ కృష్ణారెడ్డి, మాజీ సర్పంచ్ రాంరెడ్డి, బీఆర్ఎస్ గ్రామశాఖ అధ్యక్షుడు సురేందర్‌రెడ్డి, సింగిల్ విండో డైరెక్టర్ కమల్‌రెడ్డి, గ్రామ పెద్దలు, మోడల్ స్కూల్ సిబ్బంది పాల్గొన్నారు.

# చింతకుంట్ల గ్రామ సమస్యల పరిష్కారానికి ఎమ్మెల్యేకు వినతిపత్రం అందించిన గ్రామ ప్రజలు

**కొండమల్లేపల్లి, ఆగస్టు 07,(ప్రజాజ్యోతి):** చింతకుంట్ల గ్రామంలో నెలకొన్న పలు ప్రజా సమస్యలను పరిష్కరించాలని కోరుతూ దేవరకొండ ఎమ్మెల్యేకు గ్రామ ఉప సర్పంచ్ దాసరి బాలకృష్ణ యాదవ్ వినతిపత్రం అందజేశారు. వినతిపత్రంలో గ్రామ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 280 మందికి పైగా విద్యార్థులు చదువుతున్నప్పటికీ, తగినన్ని తరగతి గదులు లేక విద్యార్థులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని పేర్కొన్నారు. ఇటీవల గ్రామసభలో ప్రధానోపాధ్యాయులు కూడా రెండు అదనపు తరగతి గదుల అవసరాన్ని ప్రస్తావించారని, వాటిని మంజూరు చేయాలని కోరారు. అలాగే, ఎమ్మెల్యే సహకారంతో నిర్మించిన ప్రాథమిక ఆరోగ్య ఉపకేంద్రం (సబ్ సెంటర్) భవనంలో మిగిలిన పనులను త్వరగా పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని విజ్ఞప్తి చేశారు. చింతకుంట్ల గ్రామం నుంచి పెండ్లిపాకుల అడ్డరోడ్డు వరకు ఉన్న పంచాయతీరాజ్ రహదారి పూర్తిగా దెబ్బతిన్నందున నూతన తారు రహదారి నిర్మించాలని కోరారు. గ్రామంలోని పలు వీధుల్లో డ్రైనేజీ, సీసీ రోడ్లు లేకపోవడంతో అపరిశుభ్ర



పరిస్థితులు నెలకొన్నాయని, విద్యుత్ సమస్యలు కూడా తీవ్రంగా ఉన్నాయని వినతిపత్రంలో పేర్కొన్నారు. గ్రామానికి మంజూరైన డీఎం కుంట వీఓ భవనం నిర్మాణానికి స్థలం విషయంలో నెలకొన్న సమస్యను రెవెన్యూ శాఖ సమన్వయంతో పరిష్కరించి, నిర్మాణ పనులకు అనుమతులు మంజూరు చేయాలని కోరారు. గ్రామాభివృద్ధికి సంబంధించిన ఈ సమస్యలపై ప్రత్యేక దృష్టి సారించి, అవసరమైన నిధులు మంజూరు చేసి త్వరితగతిన పరిష్కార చర్యలు చేపట్టాలని ఎమ్మెల్యేను ఉప సర్పంచ్ దాసరి బాలకృష్ణ యాదవ్ వినతిపత్రం ద్వారా కోరారు. ఈ కార్యక్రమంలో చింతకుంట్ల గ్రామ ఉప సర్పంచ్ దాసరి బాలకృష్ణ, వార్డు సభ్యుడు ఏకుల వినోద్, మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి గ్రామ శాఖ అధ్యక్షులు వస్కుల శ్రీను, మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి మండల అధ్యక్షులు ఎదుళ్ల ఎల్లయ్య, శవ్వ మదార్, పంది నాగేశ్, ఎదుళ్ల వెంకటయ్య, మాదగోని ఆంజనేయులు, ఎదుళ్ల లక్ష్మయ్య, మాజీ ఉప సర్పంచ్ ఏకుల సురేష్ తదితరులు పాల్గొన్నారు.

# ఆగస్టు 10 జైల్ భరోను జయప్రదం చేయండి కేంద్ర కార్మిక, రైతు వ్యతిరేక విధానాలపై పోరాటానికి సిద్ధంకండి

**- భూక్య పాండు నాయక్**

**మఠంపల్లి, ఆగస్టు 7 (ప్రజా జ్యోతి):** కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న కార్మిక, వ్యవసాయ కార్మిక, రైతు వ్యతిరేక విధానాలకు నిరసనగా ఆగస్టు 10న దేశవ్యాప్తంగా నిర్వహించనున్న జైల్ భరో కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని గిరిజన సంఘం జిల్లా కార్యదర్శి భూక్య పాండు నాయక్ పిలుపునిచ్చారు. శుక్రవారం మట్టంపల్లి మండలంలోని గ్రామాల్లో వ్యవసాయ కార్మికులు, రైతులు, కూలీలతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ, రైతులు, వ్యవసాయ కార్మికులు, కార్మిక వర్గం, పేద ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించడంలో కేంద్ర ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని విమర్శించారు. వ్యవసాయ రంగాన్ని కార్పొరేట్ సంస్థలకు అనుకూలంగా మార్చే విధానాలను వెంటనే ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. అమెరికాతో కుదుర్చుకున్న స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందాల కారణంగా పాలు, వంటనూనె, పత్తి, కూరగాయలు తదితర వ్యవసాయ ఉత్పత్తుల దిగుమతులు పెరిగి, దేశీయ రైతులు తీవ్రంగా నష్టపోతున్నారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. దీనివల్ల రైతులు పండించిన పంటలకు గిట్టుబాటు ధరలు లభించక, రైతాంగం ఆర్థికంగా కుంగిపోయే పరిస్థితి ఏర్పడుతోందన్నారు. అనేక పోరాటాల ఫలితంగా సాధించిన మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టం స్థానంలో కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన వీబీజీ రామ్‌జీ బిల్లును రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఈ బిల్లు




అమల్లోకి వస్తే వ్యవసాయ కార్మికులకు తీవ్ర నష్టం జరుగుతుందని పేర్కొన్నారు. అలాగే రాష్ట్రంలో పెండింగ్‌లో ఉన్న ఉపాధి హామీ కూలీల వేతనాలను వెంటనే విడుదల చేయాలని కోరారు. కార్మిక వర్గం ఎన్నో సంవత్సరాల పోరాటాలతో సాధించుకున్న కార్మిక హక్కులను నాలుగు లేబర్ కోడ్‌ల రూపంలో బలహీనపరిచే కేంద్ర ప్రభుత్వ విధానాలను వ్యతిరేకించాలని, కార్మికులు ఐక్యంగా పోరాటాలకు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. కేంద్ర ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలకు నిరసనగా ఆగస్టు 10న హుజూర్‌నగర్ నియోజకవర్గ కేంద్రంలో నిర్వహించే భారీ జైల్ భరో కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఆయన కోరారు. అలాగే రాష్ట్రంలో భూమిలేని పేద వ్యవసాయ కార్మికులకు ప్రభుత్వం హామీ ఇచ్చిన సంవత్సరానికి రూ.12,000 ఆర్థిక సాయాన్ని వెంటనే అందించాలని, అర్హులైన ప్రతి పేద కుటుంబానికి ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర కమిటీ సభ్యులు పోసనబోయిన హుస్సేన్, సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు, గిరిజన సంఘం జిల్లా అధ్యక్షుడు బాలు నాయక్, లక్ష్మణ్, ఇంటి రవి, శాంతకుమారి, రాములు, అంజి, లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

# ఆర్యవైశ్య సంఘం పట్టణ అధ్యక్షుడిగా ఊరే జనార్ధన్



**కొండమల్లేపల్లి, ఆగస్టు 07,(ప్రజాజ్యోతి):** కొండమల్లేపల్లి మండల ఆర్యవైశ్య సంఘం పట్టణ అధ్యక్షుడిగా ఎన్నికైన ఊరే జనార్ధన్ను గ్రామ సర్పంచ్, ఉప సర్పంచ్, వార్డు సభ్యులు ఘనంగా సన్మానించారు. శాలువాతో సత్కరించి పుష్పగుచ్ఛం అందజేసి అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ, సమాజ సేవలో ముందుండే జనార్ధన్ నాయకత్వంలో ఆర్యవైశ్య సంఘం మరింత బలోపేతం అవుతుందని, యువతకు ఆదర్శంగా నిలుస్తారని పేర్కొన్నారు. నూతన బాధ్యతలను అందరి సహకారంతో సమర్థవంతంగా నిర్వహిస్తానని, ఆర్యవైశ్యుల ఐక్యత, దేవాలయాల అభివృద్ధి, విద్య, వైద్య రంగాల్లో సేవా కార్యక్రమాలకు ప్రాధాన్యం ఇస్తానని ఊరే జనార్ధన్ తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ కొడిదాల పద్మ వెంకటయ్య, వార్డు సభ్యులు ఊరే నరేష్, బిజిలి లింగం, గంట మల్లేష్, వస్కుల స్వప్న, శ్రీను, పర్వతం కొండల్, ఆర్యవైశ్య సంఘం సభ్యులు, గ్రామ ప్రముఖులు పాల్గొని నూతన అధ్యక్షుడికి శుభాకాంక్షలు తెలిపారు.

# పోచంపల్లిలో 'ఎక్స్ పీరియన్స్ యార్డ్' పైలట్ లాంచ్




**భూదాన్ పోచంపల్లి, ఆగస్టు 07 (ప్రజాజ్యోతి):** చేనేత, స్థానిక కళలు, గ్రామీణ జీవన విధానాన్ని పర్యాటకులకు పరిచయం చేసే 'పోచంపల్లి ఎక్స్‌పీరియన్స్ యార్డ్' పైలట్ కార్యక్రమాన్ని శనివారం నిర్వహించనున్నారు. యాదాద్రి భువనగిరి జిల్లా పరిపాలన ఆధ్వర్యంలో స్థానిక చేనేత కళాకారులు, మహిళా సంఘాలు, కమ్యూనిటీ భాగస్వాములతో కలిసి ఈ కార్యక్రమాన్ని చేపడుతున్నారు. మిస్ ఆసియా--2023, ఇకత్ అంబాసిడర్ రష్మి ఠాకూర్ ప్రత్యేక ఆహ్వానితురాలిగా పాల్గొననున్నారు. పోచంపల్లి ఇకత్ మ్యూజియం నుంచి ప్రారంభమయ్యే ఈ నాలుగు గంటల అనుభవ కార్యక్రమంలో ఇక్కత్ మ్యూజియం సందర్శన, చేనేత కార్మికుల ఇళ్ల సందర్శన, ఇకత్ వస్త్రధారణ, తెలంగాణ సంప్రదాయ భోజనం, స్థానిక బజార్--సావనీర్ టూర్ తదితర కార్యక్రమాలు ఉంటాయి. శనివారం ఉదయం 10:30 గంటలకు ప్రారంభమై మధ్యాహ్నం 2:30 గంటల వరకు కార్యక్రమం కొనసాగనుంది.

# ఘనంగా బోనాల పండుగ ఏర్పాట్లు

**- విద్యుత్ దీపాలతో సర్వాంగ సుందరంగా**

**-ముత్యాలమ్మ,పోచమ్మ ఆలయాలు**

**నిడమనూరు,ఆగస్టు07(ప్రజాజ్యోతి):** నాగార్జునసాగర్ పట్టణంలో తెలంగాణ సంస్కృతి,సంప్రదాయాలకు ప్రతీక అయిన బోనాల పండుగను పురస్కరించుకుని స్థానిక ఆలయాలు సర్వాంగసుందరంగా ముస్తాబవు తున్నాయి,ఆదివారం ఘనంగా నిర్వహించనున్న ఈ పండుగ వేడుకల కోసం ఆలయ కమిటీల ఆధ్వర్యంలో ఏర్పాట్లు తుది దశకు చేరుకున్నాయి. పట్టణంలోని ప్రధాన కాలనీల్లో ఉన్న అమ్మవారి ఆలయాలు భక్తులతో కిటకిటలాడేందుకు సిద్ధమయ్యాయి. ముఖ్యంగా పైలాన్ కాలనీలోని పోచమ్మ దేవాలయం,హిల్ కాలనీ డౌన్ పార్క్ ప్రాంతంలో వెలసిన ప్రసిద్ధ శ్రీ కాళికా మాతా దేవి,ముత్యాలమ్మ ఆలయలలో బోనాల ఉత్సవాలకు పకడ్బందీ ఏర్పాట్లు చేస్తున్నారు. ఆకర్షణీయమైన విద్యుద్దీపాలు,పూలతో,అలంకరించారు,ఆదివారం తెల్లవారుజాము నుంచే భక్తులు అమ్మవారిని దర్శించుకుని, భక్తిశ్రద్ధలతో బోనాలు సమర్పించి మొక్కులు చెల్లించుకోనున్నారు. ఈ నేపథ్యంలో భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ఆలయ కమిటీ నిర్వాహకులు అన్ని సౌకర్యాలను కల్పిస్తున్నారు. ఉత్సవాలను విజయవంతం చేయడానికి స్థానిక ప్రజలు,కూడా ఏర్పాట్లలో నిమగ్నమయ్యాయి.

